జూలై 1న శ్రీ సిటీలో హీరో మోటోకార్ప్ రెండో గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి



3

# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - శనివారం 27 జూన్ 2026 | సంపుటి: 10 | సంచిక: 173 | పేజీలు: 8+4 | వెల రూ.5

ముఖ్యమంత్రిను కలిసిన బిజెపి నేత తుగ్గలి నవీన్ రెడ్డి



6

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM |

## విద్యావ్యవస్థలో మార్పునకు ఉపాధ్యాయులు నాయకత్వం వహించాలి

- రాష్ట్రంలో టీచర్లంతా ఛేంజ్ మేకర్లుగా, నాయకులుగా తయారుకావాలి
- కష్టపడి మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు గుర్తింపునిస్తాం
- రాష్ట్ర విద్యావ్యవస్థలో సంస్కరణల వల్లే ప్రైవేటు నుంచి లక్షమంది చేరిక
- అందరం కలిసికట్టుగా ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ సాధిద్దాం
- విద్యారంగంలో ఆంధ్రప్రదేశ్‌ను నెం.1గా నిలబెడతాం
- సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన టీచర్లతో మంత్రి లోకేష్ సమావేశం



**తాడేపల్లి, జూన్ 26, మనం న్యూస్:** రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ప్రజా ప్రభుత్వం టీచర్లను లీడర్లు భావిస్తోంది, కష్టపడి మంచి ఫలితాలు సాధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపునిస్తామని రాష్ట విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు వెళ్లిన 37మంది ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి లోకేష్ ఉండవల్లి నివాసంలో సమావేశమయ్యారు. సింగపూర్ అధ్యయన యాత్రలో తాము తెలుసుకున్న అంశాలు, రాష్ట్రంలో వాటిని అమలు చేయడానికి గల అవకాశాలను వారు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్మాట్లాడుతూ.. ...మిగతా 2లో



# రొట్టెల.. పండగ పోటెత్తిన భక్తులు

- సుదూర ప్రాంతాల నుంచి భారీగా విచ్చేసిన భక్తులు
- పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర సేవలు
- పక్కాగా ఏర్పాట్లు ... సంతృప్తి వ్యక్తం చేసిన భక్తులు
- ప్రశాంత వాతావరణంలో రొట్టెలు మార్చుకున్న భక్తులు



**(నెల్లూరు నుంచి పి. మీరా హుస్సేన్ , మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** నెల్లూరు బారాషహీద్ దర్గాలో ప్రారంభమైన రొట్టెల పండుగకు తొలి రోజు భక్తులు భారీగా తరలివచ్చారు. దేశం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల , ఎస్పీ అజిత వేజండ్ల, మున్సిపల్ కమిషనర్ నందన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ అన్ని చర్యలు చేపట్టడంతో భక్తులందరూ సజావుగా దర్గాను దర్శించుకుని, రొట్టెలు మార్చుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కోర్కెలు తీరిన వారు రొట్టెలను వదలడం... కోర్కెలతో వచ్చిన వారు ఆ రొట్టెలను స్వీకరించడం వంటి దృశ్యాలతో స్వర్ణాల చెరువు ఘాట్ పరిసర ప్రాంతాలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి.

**పటిష్ట బందోబస్తు**

దర్గా ప్రాంగణంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, క్యూలైన్లు సజావుగా సాగేలా, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పటిష్ట పోలీసు ...మిగతా 2లో

## పేదల ఆరోగ్యానికి కొండంత అండ 'సీఎంఆర్ఎఫ్'



మంత్రి కందుల దుర్గేష్

**(నిడదవోలు,అమరావతి,మనం న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేద ప్రజల ఆరోగ్య భద్రతకు ఒక గొప్ప వరమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ...మిగతా 2లో

## ఇందిరా గాంధీ స్వార్థం కోసమే ఎమర్జెన్సీ

కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ



**నరసాపురం, జూన్ 26 (మనం న్యూస్):** ఇందిరా గాంధీ స్వార్థం కోసం విధించిన ఎమర్జెన్సీ కాలం దేశచరిత్రలో అత్యంత చీకటి రోజులని కాంగ్రెస్ పార్టీ కుట్ర పూరిత రాజకీయాలు నేటి తరానికి తెలియజేయవలసిన అవసరం ...మిగతా 2లో



## పల్నాడులో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

- ప్రమాదాల ప్రదేశాలను గుర్తించి ముందస్తు భద్రతా సూచికలు ఏర్పాటు చేయాలి
- పల్నాడు ఉన్నతాధికారుల సమీక్షలో ఇన్చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు

2

## భారత్ ఆలౌట్.. తొలి టీ20లో ఐర్లాండ్ విజయం

రెండు టీ20ల సిరీస్ లో భాగంగా శుక్రవారం భారత్ తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్ విజయం సాధించింది. 34 పరుగుల తేడాతో గెలుపొందింది. 8

## 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యంగా అందరూ పని చేయాలి



కేంద్ర హోం మంత్రి అమిత్ షా

**అమరావతి,జూన్:26,మనం ప్రత్యేక ప్రతినిధి):** వచ్చే 2047 నాటికి మాదక ద్రవ్య రహిత భారత్ (డ్రగ్స్ ఫ్రీ భారత్)సాధనే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పిలుపు నిచ్చారు.శుక్రవారం ఆయన ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు,పోలీసు ఉన్నతాధికారులు,నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర విభాగాల అధికారులతో నార్కో కోఆర్డినేషన్ పై వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడి పిలుపు మేరకు 2047 నాటికి డ్రగ్స్ రహిత భారత్ సాధనే లక్ష్యంగా పని చేయాలని ఇందుకు సాంకేతికత సాయంతో పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు.ముఖ్యంగా మాదక ద్రవ్యాలు సరఫరా,విక్రయం చేసే వారిపై కఠినంగా మరియు జీరో టోలరెన్స్ గా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఇందుకు సంబంధించిన హాట్ స్పాట్లను గుర్తించి కట్టుదిట్టమైన ...మిగతా 2లో



## యువశక్తే దేశానికి పెట్టుబడి

- గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం
- డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యం

హోం మంత్రి వంగలపూడి అనిత

**(విజయవాడ,జూన్,26,మనం ప్రతినిధి):** దేశంలో అత్యంత శక్తివంతమైన మానవ వనరులైన యువశక్తి భగ్నం కాకుండా, రాబోయే తరాల అభివృద్ధికి వారిని ఒక పెట్టుబడిగా ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, డిపార్ట్మెంట్ ఫర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫెరెంట్లీ ఏబుల్డ్, ట్రాన్స్జెండర్ అండ్ సీనియర్ సిటిజన్స్ శాఖ, ఈగల్ సంయుక్త ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక ...మిగతా 2లో

## సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



2

## సాయికృష్ణ లాకప్ డెత్ గురించి క్రాంతి కుమార్‌కు తెలుసు

- అందుకే భయపడి ఆత్మహత్య చేసుకున్నాడు
- జగన్ పరామర్శ తర్వాతే సాయికృష్ణపై స్పందించిన సర్కార్
- క్రాంతి కుమార్ పై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి
- మాజీ ఎంపీ హర్ష కుమార్ డిమాండ్



**విజయవాడ,జూన్,26,(మనం న్యూస్):** విజయవాడలో జరిగిన సాయికృష్ణ లాకప్ డెత్ తో పేరుపోగు క్రాంతి కుమార్ ఆత్మహత్యకు లింకు ఉందని దళిత సంఘాలు స్పష్టం చేశాయి. సాయికృష్ణను పోలీసులు వేధించి చంపేయడం చూసిన తర్వాతే క్రాంతి కుమార్ తనకూ అలాగే జరుగుతుందని భయపడి ఆత్మహత్య చేసుకున్నాడని విజయవాడలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు నిర్వహించిన సమావేశంలో తేల్చిచెప్పాయి. సాయికృష్ణ కుటుంబాన్ని పిలిపించి మాట్లాడిన చంద్రబాబు.. ఇప్పటివరకూ క్రాంతి కుమార్ కుటుంబాన్ని మాత్రం పట్టించుకోకపోవడం దారుణమని తెలిపాయి. ప్రభుత్వ తీరుకు నిరసనగా ...మిగతా 2లో

## పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా



- మార్కెట్ పరిస్థితులపై నిరంతర నిఘా పెట్టాలి
- పొగాకు రైతుల సమస్యలు, ఎరువుల పంపిణీపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి కింజరాపు అచ్చెన్నాయుడు

2

## అంతు పట్టని పవన్ కళ్యాణ్ అంతర్గత వ్యూహం

- 15 సంవత్సరాలు గడువు రహస్య ఒప్పందమా
- జాతీయ రాజకీయాల్లో పాల్గొనడంపైనా చర్చ
- మింగుడు పడని లోకేష్ సీఎం నినాదం
- 100 సీట్లు కోసం కాపు సంఘాల అల్టిమేటంకు సన్నద్ధం?

**పాలకొల్లు, జూన్ 26(మనం ప్రతినిధి):** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భవిష్యత్తు అంతర్గత వ్యూహం అంతు పట్ట లేకుండా ఉంది. ఏపీ రాష్ట్రంలో 2024 కు ముందు ప్రజా వ్యతిరేక ప్రభుత్వం వైసీపీ అని, ప్రజలు ఇబ్బందులుకు గురవుతున్నారని తాను సీఎం అవ్వడం ప్రధానం కాదని ప్రజలను వైసిపి ప్రభుత్వం నుంచి రక్షించడానికి కూటమి ప్రభుత్వంలో చేరానని పవన్ కళ్యాణ్ చెప్పిన, చెబుతున్న విషయం విదితమే. అయితే పవన్ కళ్యాణ్ అసలు భవిష్యత్ అంతర్గత ప్రణాళిక ఏంటనేది తెలియకపోవడంతో అటు కాపు సంఘాల నేతలు, ఇటు జనసేన శ్రేణులు డోలయనంలో కొట్టుమిట్టాడు తున్నాయి. పవన్ కళ్యాణ్ భవిష్యత్తు ప్రణాళిక చిదంబర రహస్యం తెలియ కపోవడంతో ఈ రెండు వర్గాలు తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. వారే కాకుండా టిడిపి, ...మిగతా 2లో

## ఉచితాల కంటే మౌలిక వసతులకే ప్రాధాన్యం ఇవ్వాలి

- మాజీ ఉపరాష్ట్రపతి డాక్టర్ వెంకయ్యనాయుడు
- ఆత్కూరులో నూతన పీహెచ్సీ భవనం ప్రారంభం
- ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమం విజయవంతం



**ఆత్కూరు, జూన్ 26 (మనం ప్రతినిధి):** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పాత్ర అత్యంత కీలకమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ...మిగతా 2లో

## తొలిసారి భారత్ పర్యటనకు జపాన్ ప్రధాని తకాయిచి



**ఢిల్లీ, జూన్ 26:** జపాన్ ప్రధాని సనాయె తకాయిచి భారత్ పర్యటనకు రానున్నారు. మూడు రోజుల పాటు ఆమె ఇక్కడ పర్యటించనున్నారు. ఢిల్లీలో జులై 1 నుంచి 3వ తేదీ వరకు భారత్-జపాన్ 16వ వార్షిక సదస్సు జరగనుంది. ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు ఈ సదస్సులో పాల్గొనేందుకు తకాయిచి రానున్నట్లు భారత విదేశాంగశాఖ వెల్లడిం చింది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంతోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరు దేశాధినేతలు అభిప్రాయాలను పంచుకునేందుకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని పేర్కొంది. సనాయె తకాయిచి భారత్ పర్యటనకు రావడం ఇదే తొలిసారి. గతేడాది టోక్యోలో ఇరుదేశా ల మధ్య జరిగిన 15వ సదస్సుకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. అప్పుడే ఆమెను భారత్‌కు ఆహ్వానించారు. టోక్యో సదస్సు తర్వాత ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు బలోపేతమయ్యా యని విదేశాంగశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

## వెనెజువెలా కోసం ఆపరేషన్ అమిస్టాడ్!

విదేశాంగ మంత్రి జైశంకర్



2

# విద్యావ్యవస్థలో మార్పునకు ఉపాధ్యాయులు నాయకత్వం వహించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఉపాధ్యాయులు సమాజంలో మార్పునకు నాయకత్వం వహించే లీడర్లని అన్నారు. విద్యద్వారానే సమాజంలో మార్పు సాధ్యమవుతుంది, అందుకోసమే నేను పట్టుదల, కమిట్ మెంట్ తో విద్యాశాఖను తీసుకున్నాను, ప్రపంచంలో అత్యుత్తమ మోడల్ విద్యావిధానం కోసం అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశించిన స్వర్ణాంధ్ర సాధనలో విద్యాశాఖ కీలకపాత్ర వహిస్తుంది, క్వాంటమ్, ఏఐ వంటి అధునాతన సాంకేతికతలు అమలు చేయడం విద్యాశాఖ ద్వారా మాత్రమే సాధ్యమని అన్నారు. నేను చిన్న వయసులోనే అమెరికా వెళ్లి స్టాన్ ఫోర్డ్ లో విద్యనభ్యసించాను, అక్కడ 100 దేశాల విద్యార్థులతో కలిసి ఐడియాస్, నాలెడ్జి, కల్చర్ పంచుకునే అవకాశం లభించిందని తెలిపారు.విదేశాల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులంతా ఛేంజ్ మేకర్స్ గా తయారు కావాలి. సింగపూర్ అధ్యయన యాత్రలో మీరు నేర్చుకున్న అంశాలను స్కూలు, క్లస్టర్, మండలాల్లో అమలు చేసేందుకు నాయకత్వం వహించండి. సహ టీచర్లకు మెంటరింగ్ చేయండి. టీచర్ - స్టూడెంట్ - సబ్జెక్ట్ రిలేషన్ షిప్ ముఖ్యం. ప్రస్తుతం మనం మౌలిక సదుపాయాలపై దృష్టిపెట్టి, సాఫ్ట్ వేర్ మర్చిపోతున్నాం. రాష్ట్రంలో లీప్ మోడల్ విద్యావ్యవస్థ సాధనకు కలిసికట్టుగా పనిచేయాలి. టీచర్లు బోధనపైనే శ్రద్ధ వహించాలని అన్నారు. విద్యావ్యవస్థలో ఆశించిన మార్పు తేవడం వెనువెంటనే సాధ్యం కాదు, ఇందుకు కొంత సమయం పడుతుంది. రాష్ట్రంలో మనం చేపట్టిన సంస్కరణల కారణంగా ఈ ఏడాది లక్షమందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు మారారు, ఇది శుభపరిణామం, ప్రభుత్వ ఉపాధ్యాయులకు మించిన టీచర్లు ప్రైవేటు స్కూళ్లలో లేరు, ఆదర్శవంతమైన విద్యావ్యవస్థ (ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్) సాధనకు మీ సహకారం కావాలి, కలిసికట్టుగా పనిచేసి అత్యుత్తమ ఫలితాలు సాధించాలి, లక్షలాదిమంది బిడ్డల భవిష్యత్తు మనపై ఆధారపడి ఉంది. ఈరోజు దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ గురించి చర్చ జరుగుతోంది. ఇప్పుడు మనం ఇతర రాష్ట్రాలతో కాదు, ఇతర దేశాలతో పోటీపడాలి, ఉపాధ్యాయులకు నా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి లోకేష్ చెప్పారు. ఎటువంటి పైరవీలకు తావులేకుండా టీచర్ ట్రాన్స్ ఫర్ యాక్ట్ తెచ్చి సీనియారిటీ ప్రాతిపదికన పారదర్శకంగా ప్రమోషన్లు ఇచ్చాం. మీకు అత్యంత శక్తి, సామర్థ్యాలు ఉన్నాయి, ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ ను ప్రపంచానికి చాటిచెప్పాలి, ఇందులో భాగంగా ఇప్పుడు తొలిఅడుగు వేశాం.అభ్యసన ఫలితాలు, ఎనలిటికల్ థింకింగ్ పై దృష్టిసారించాలి. విద్యావ్యవస్థలో అన్ని సమస్యలను ఒకేరోజు పరిష్కరించడం సాధ్యం కాదు, ప్రాధాన్యత క్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తాం, ప్రజాప్రభుత్వం మీ వెంట ఉంది, విద్యారంగంలో ఏపీని నెం.1గా తయారుచేసేందుకు సమిష్టిగా కృషిచేద్దామని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. సింగపూర్ టూర్ ద్వారా ఉపాధ్యాయులు వివిధ అంశాలపై కెపాసిటీ బిల్డింగ్ పై శ్రద్ధవహించాలి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 75ఏళ్ల వయసులో ఇప్పటికీ నేర్చుకుంటూనే ఉంటారు. ఇటీవల ఆయన సింగపూర్ వెళ్లి ప్రధాని, ఇతర మంత్రులను కలిసి పలు కొత్తవిషయాలపై అధ్యయనం చేశారు, గత కొంతకాలంగా ప్రభుత్వ టీచర్లకు గౌరవం పెరిగింది, మీరు లీడర్లుగా, ఛేంజ్ మేకర్స్ గా తయారుకండి, మీకు అండగా మేముంటామని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, ఎస్ సీఈఆర్ టీ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడులో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**(అమరావతి,జూన్,26,మనం ప్రత్యేక ప్రతినిధి):** పల్నాడు జిల్లాలో ఇటీవల వరుసగా చోటు చేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలపై జిల్లా ఇన్చార్జి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో ఫోన్లో మాట్లాడిన మంత్రి, ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, వాటిని యాక్సిడెంట్ స్పాట్స్ గా గుర్తిస్తూ... అవసరమైన ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రహదారులపై ప్రమాద సూచికలు, హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టివ్ సైనేజీలు ఏర్పాటు చేసి, వాహనదారులు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించిన మంత్రి, భారీ వాహనాలు సాంకేతిక లోపం లేదా ఇతర కారణాలతో రోడ్డుపై నిలిచిపోయిన సందర్భాల్లో, వెనుక నుంచి వచ్చే వాహనాలకు ముందుగానే హెచ్చరిక అందేలా వెంటనే భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీకి దిశానిర్దేశం చేశారు. అవసరమైతే ట్రాఫిక్ సిబ్బంది, క్రేన్లు, అత్యవసర సహాయక బృందాలను వెంటనే రంగంలోకి దించాలని పేర్కొన్నారు. మాచర్ల నగరవనం సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబాలకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. ప్రమాదంలో గాయపడిన వారికి అందుతున్న వైద్య చికిత్సపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్న మంత్రి, క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని, అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణ భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న మంత్రి, రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదాల సంఖ్య తగ్గించే దిశగా శాశ్వత చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# ఉచితాల కంటే మౌలిక వసతులకే ప్రాధాన్యం ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ ముప్పవరపు వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా ఆత్కూరులో నూతనంగా నిర్మించిన పీహెచ్సీ భవనాన్ని ఆయన శుక్రవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్, శాప్ (ఖీఅక్క) ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ప్రభుత్వాలు ప్రజా రంజక పాలన పేరిట ప్రవేశపెట్టే తాత్కాలిక ఉచిత పథకాలను వీలైనంత వరకు తగ్గించుకోవాలని వెంకయ్యనాయుడు హితవు పలికారు. ప్రజల దీర్ఘకాలిక భవిష్యత్తుకు ఉపయోగపడేలా, సమాజ ప్రగతికి తోడ్పడే శాశ్వత మౌలిక వసతుల కల్పనపైనే రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. కార్యక్రమం దిగ్విజయం కావడానికి స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రత్యేక బాధ్యత తీసుకుని, అన్ని ఏర్పాట్లను ఘనంగా, ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షించారు. ఈ అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమంలో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ, ప్రముఖ నాయకులు పిన్నమనేని వెంకటేశ్వరరావు , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యుగంధర్ పాల్గొన్నారు. అలాగే మౌలిక వసతుల కల్పనలో కీలక పాత్ర పోషించిన పంచాయతీ రాజ్ ఈఈ లోకేష్ , స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఈఈ మునిశేఖర్ , డీఎస్డీఓ ఝాన్సీ లక్ష్మి, వివిధ క్రీడా విభాగాల కోచ్లు (ఇొ్ఛిఙ్ఛిట), స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, గ్రామ పెద్దలు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# రొట్టెల.. పండగ.. పోటెత్తిన భక్తులు

(మొదటి పేజీ తరువాయి)

బందోబస్తును ఏర్పాటు చేశారు. సుమారు 1800 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. పోలీస్ అవుట్ పోస్ట్ ద్వారా అనౌన్స్మెంట్ చేస్తు ఎప్పటికప్పుడు భక్తులను అప్రమత్తం చేస్తున్నారు. తప్పిపోయిన చిన్నారులను, వృద్ధులను వెంటనే సంబంధికులకు అప్పగిస్తున్నారు.

**పారిశుధ్య సిబ్బంది సేవలు భేష్**

దర్గా పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తా చెదరాన్ని తొలగిస్తూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారు. దర్గా ప్రాంగణాన్ని ఏడు జోన్లుగా విభజించి 6 వేలకు పైగా సిబ్బందితో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపడుతున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు సెప్టిక్ ట్యాంక్ వాహనాల ద్వారా శుభ్రపరుస్తున్నారు. దీంతో దర్గా పరిసరాలు పరిశుభ్రతతో కళకళలాడుతున్నాయి.

**వైద్య శిబిరాలను వినియోగించుకుంటున్న భక్తులు**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రత్యేక వైద్యులను, సిబ్బందిని బ్యాచ్ ల వారీగా నియమించి 24 గంటలూ భక్తులకు వైద్య సేవలందిస్తున్నారు. మొదటిరోజు సుమారు 400 మంది పైగా భక్తులకు బిపి, రక్త పరీక్షలు, మందులు అందజేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుజాత తెలిపారు.

**ప్రత్యేకంగా ఆయుష్ వైద్య శిబిరం**

ప్రజలకు ఆయుష్, యునాని, హోమియో వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు రొట్టెల పండుగలో ప్రత్యేకంగా ఆయుష్ స్టాల్ ను ఏర్పాటు చేశారు. ఆయుష్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరాజు, సరళ హెబ్సిబా, జ్ఞాన ప్రసూన, వినోద్ బాబు వైద్య సేవలు అందించారు. సుమారు 500 మంది ఆయుష్ విభాగం సేవలను వినియోగించుకున్నారు.

**అప్రమత్తంగా అగ్నిమాపక శాఖ**

స్వర్ణాల చెరువులో ఏ చిన్న ప్రమాదం జరగకుండా అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో 24 గంటలూ అప్రమత్తంగా బోట్లు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచారు. దర్గా ఆవరణలో అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచారు.

**భక్తులందరికీ అన్నదానం**

రొట్టెల పండుగకు విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉచిత అన్నదానాన్ని వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అన్నదాన కేంద్రాలను ఏర్పాటు చేసి భక్తులకు అందిస్తున్నారు. అలాగే భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని స్టాల్స్ ఏర్పాటు చేసి మున్సిపల్ అధికారులు అందజేస్తున్నారు.

**ప్రత్యేకంగా మీడియా పాయింట్**

రొట్టెల పండుగ కవరేజ్ నిమిత్తం దర్గాకు విచ్చేస్తున్న మీడియా వారికి ప్రత్యేకంగా జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో మీడియా పాయింట్ను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. పాత్రికేయులు, ఫోటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు ఈ కేంద్రం నుంచి తమ విధులు నిర్వహిస్తూ రొట్టెల పండుగ విశేషాలను, సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందిస్తున్నారు. మీడియా వారికి ప్రత్యేకంగా అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించారు.

# యువశక్తే దేశానికి పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి వంగలపూడి అనిత యువతకు, తల్లిదండ్రులకు కీలక సందేశాన్ని ఇచ్చారు.

**డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం**

మాదకద్రవ్యాల జోలికి ఎవరూ పోకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ యాంటీ నార్కోటిక్ క్యాంపెయిన్ను నిర్వహిస్తున్నాయని తెలిపారు.

నేటి తరం పిల్లలు ఎంతో ఫాస్ట్ గా, క్లారిటీగా ఉంటున్నప్పటికీ, చిన్న అవగాహన లోపం వల్ల డ్రగ్స్ బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' (నివారణే మేలు) అన్నట్లుగా, యువత వీటి జోలికి వెళ్లకుండా ముందే కాపాడుకోవడం ముఖ్యం అని చెప్పారు.

**60శాతం నుండి 70 శాతం స్నేహితుల ప్రభావమే**

దేశంలో దాదాపు 3.5 నుండి 4 కోట్ల మంది గంజాయి, డ్రగ్స్కు అలవాటు పడ్డారని, ముఖ్యంగా 13 నుండి 18 సంవత్సరాల వయస్సు వారు ఎక్కువగా దీనికి ఆకర్షితులవుతున్నారని హోం మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం స్నేహితుల ఒత్తిడి వల్లే 60 నుంచి 70 శాతం మంది వీటికి బానిసలవుతున్నారని, ఇలాంటి అలవాట్లు చేసే స్నేహితులు శత్రువులతో సమానమని హెచ్చరించారు.

**తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయవద్దు**

ఎన్నో కష్టాలకోర్చి, తమ స్థాయికి మించి పిల్లలను హాస్టల్స్ లో ఉంచి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశలను యువత అపహాస్యం చేయవద్దని కోరారు. ఒక్కసారి గంజాయికి బానిసైతే జైలు పాలవ్వడం ఖాయమని, ఈ మధ్య కాలంలో తల్లిదండ్రులు కూడా ఇలాంటి పిల్లలకు బెయిల్ ఇప్పించడానికి ముందుకు రావడం లేదని గుర్తుచేశారు.

# సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

**మార్కాపురం,జూన్,26, (మనం న్యూస్)ః** వెనుకబడిన మార్కాపురం జిల్లాకు కృష్ణా జలాలను అందించి సస్యశ్యామలం చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 27 జిల్లాకు వస్తున్న సందర్భంగా ఈ పర్యటనలో పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా పర్యటన సందర్భంగా జిల్లాకు వరప్రదాయినిగా నిలిచిన శ్రీ పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాస, పునరుద్ధరణ ప్యాకేజీల చెక్కులను అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం గిద్దలూరు సమీపంలోని కృష్ణంశెట్టిపల్లిలో నిర్మించిన సంజీవిని ఆసుపత్రిని ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

మార్కాపురం జిల్లాగా అవతరించిన అనంతరం ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు తొలిసారిగా గిద్దలూరును సందర్శించడం విశేషమన్నారు. ఈ పర్యటన జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా పేర్కొంటూ, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి స్థాయి ప్రయోజనాలు ప్రజలకు అందేలా చర్యలు, నిర్వాసితుల సమస్యల పరిష్కారం, జిల్లా అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, నిధుల కేటాయింపు వంటి అంశాలపై ప్రజల్లో ఆశాభావం నెలకొందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా మార్కాపురం జిల్లాతో పాటు పరిసర ప్రాంతాల వ్యవసాయ, తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుతో అభివృద్ధి వికేంద్రీకరణకు అవకాశం ఏర్పడిందని, ఇప్పుడు ముఖ్యమంత్రి పర్యటన ద్వారా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో జిల్లావాసులు, రైతులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడంతో పాటు జిల్లా అభివృద్ధికి తమ మద్దతును తెలియజేయాలని బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు.

# 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారత్ సాధనే లక్ష్యంగా అందరూ పని చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నిఘా ఉంచి కింగ్ పిన్ లను పెట్టుకోవడంతో పాటు వారికి సకాలంలో శిక్షపడేలా చూడాలన్నారు.

ప్రత్యేక రోడ్డు మ్యాప్ ను రూపొందించుకోవడంతో పాటు కమ్యూనిటీ పోలీసింగ్ ను మరింత పెంపొందించుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాష్ట్రాలకు స్పష్టం చేశారు.అదే విధంగా మాదక ద్రవ్యాల సేవనం, సరఫరా, విక్రయాల వల్ల కలిగే అనర్థాలు గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కలిగించాలని చెప్పారు. విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఎపిలో ఉఅఎఔఉ (ఉజాఙ్ఛీ అ్టజీ-న్చ్టఛిౌజీఛిట ఎటౌఞ్ఛ జౌట ఔ్చఠీ ఉఞజౌటఛ్ఛిఝ్ఛుు)పోలీసు విభాగం ప్రత్యేక రాష్ట్ర స్థాయి మాదకద్రవ్య వ్యతిరేక దళం సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు.ఒకప్పుడు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గంజాయి ప్రాంతంగా పేరుపొందిన ఆంధ్రప్రదేశ్ నేడు మాదకద్రవ్యాల నియంత్రణ అమలులో జాతీయ స్థాయిలో ఒక ఆదర్శప్రాయమైన ప్రమాణంగా నిలిచిందని అన్నారు. రైల్వే నెట్వర్క్ ద్వారా రాష్ట్రాల మధ్య జరిగే మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకోవడానికి ప్రతి జిల్లాలో వారానికి మూడుసార్లు స్థానిక పోలీసులు,జీఆర్పీ, ఆర్పీఎఫ్,ఈగల్ మరియు శునక దళాలను సంయుక్తంగా మోహరించి పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈగల్ మంగళగిరిలోని ప్రధాన కార్యాలయంలో ఒక ప్రత్యేకమైన, సురక్షితమైన డేటా సెంటర్ను నిర్వహించడంతో పాటు రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక వ్యవస్థకు కేంద్రీకృత నిఘా కేంద్రంగా పని చేస్తోందని తెలిపారు. ఈవీడియో సమావేశంలో ఈగల్ చీఫ్ ఐజిపి ఆకె రవికృష్ణ,ఈగల్ ఎస్పి ఆపరేషన్స్ కెయం. మహేశ్వర రాజు, విశాఖపట్నం ఎన్సిబి ఎస్పి జెడి పంకజ్,ఎన్సిబి డిఎస్పి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి కొండంత అండ 'సీఎంఆర్ఎఫ్'

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో నియోజకవర్గానికి చెందిన 125 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 71,81,116 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను, ఎల్వోసీ పత్రాలను మంత్రి దుర్గేష్ స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 113 మందికి రూ. 45,38,253 విలువైన చెక్కులు, 12 మందికి రూ. 26,42,863 విలువైన ఎల్వోసీ పత్రాలు అందించామన్నారు. 'నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ, మరియు ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా మొత్తం 998 మంది బాధితులకు రూ. 6,79,62,676 ఆర్థిక లబ్ధి చేకూర్చాం.'అని మంత్రి కందుల దుర్గేష్ వివరాలు వెల్లడించారు. ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిరుపేదలకు ప్రతి 15 రోజుకొకసారి సీఎంఆర్ఎఫ్ సాయం అందిస్తుండం గొప్ప విషయమని, ఇది ఒక నిరంతర ప్రక్రియ అని స్పష్టం చేశారు. సకాలంలో నిధులు విడుదల చేసి పేదలను ఆదుకుంటున్నందుకు గాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్లకు మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా ధన్యవా దాలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే పేదలపై ఆర్థిక భారం పడకుండా సీఎంఆర్ఎఫ్ ద్వారా పూర్తి సహకారం అందిస్తున్నామని చెప్పారు. బాధితులు శారీరక ంగా, ఆర్థికంగా కుంగిపోకుండా కొండంత అండ గా నిలవడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు.

**ప్రభుత్వానికి లబ్ధిదారుల కృతజ్ఞతలు**

కష్టకాలంలో తమకు అండగా నిలిచినందుకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. నిరుపేద కుటుంబాలను ఆదుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు స్థానిక శాసనసభ్యులు, మంత్రి కందుల దుర్గేష్ లకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# పొగాకు గిట్టుబాటు ధరకు ప్రభుత్వం గట్టి భరోసా

**అమరావతి/విశాఖపట్నం , జూన్ 26 మనం న్యూస్:** వర్జీనియా పొగాకు రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోలు ప్రక్రియను జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలని, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సరాసరి ధర కిలోకు రూ.200 కంటే తక్కువ ధరకు కొనుగోళ్లు జరిగేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వొద్దని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ జిలాని, వర్జీనియా పొగాకు సాగు జరిగే జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం మంత్రి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పొగాకు కొనుగోళ్లు, రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు, ఖరీఫ్ సీజన్కు సంబంధించిన ఎరువుల లభ్యత, పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, కంపెనీలు నిర్ణయించిన నిబంధనలకు లోబడి పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ సహా అన్ని రకాల ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందేలా నిల్వలు, రవాణా, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, కృత్రిమ కొరత, నిల్వదాచివేత, అధిక ధరలకు విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఇటీవల జరిగిన పొగాకు బోర్డు 168వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కూడా మంత్రి ప్రస్తావించారు. 2026-27 పంట సంవత్సరానికి మార్కెట్ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ డిమాండ్, రైతుల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని ఆంధ్రప్రదేశ్లో ఎఫ్ సి వి పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని సుమారు 81 మిలియన్ కిలోలకు నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే, ఎఫ్ సి వి పొగాకు మార్కెటింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొనుగోలు విధానంలో పారదర్శకత పెంచడం, పంట నియంత్రణ వ్యవస్థలో అవసరమైన సంస్కరణలు తీసుకురావడం, రైతులకు మెరుగైన ప్రయోజనాలు కల్పించడం కోసం అన్ని భాగస్వాములతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఏ సమస్య వచ్చినా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులకు గిట్టుబాటు ధర, ఖరీఫ్ రైతులకు సకాలంలో ఎరువుల సరఫరా జరిగేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.

# ఇందిరా గాంధీ స్వార్థం కోసమే ఎమర్జెన్సీ

(మొదటి పేజీ తరువాయి)

ఉందని కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. శుక్రవారం నరసాపురం స్వర్ణాంధ్ర కళాశాలలో నిర్వహించిన ప్రజాస్వామ్య హత్య దినం 1975 జూన్ 25 పై జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సదస్సులో కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ1975 నాటి చీకటి రోజులను గుర్తుచేస్తూ నాడు జరిగిన ప్రజాస్వామ్య విధ్వంసాన్ని తీవ్రంగా ఖండించారు.అవి భారతదేశ చరిత్రలోనే అత్యంత చీకటి రోజులని అప్పటి కాంగ్రెస్ ప్రధాని ఇందిరా గాంధీ తన స్వార్థ ప్రయోజనాల కోసం, అధికారాన్ని కాపాడుకోవడం కోసం దేశంపై బలవంతంగా ఎమర్జెన్సీని రుద్దారని శ్రీనివాస వర్మ విమర్శించారు. ప్రజాస్వామ్యానికి దేవాలయమైన మన భారతదేశంలో ప్రజల ప్రాథమిక హక్కులను ఇందిరా గాంధీ కాలరాశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరా గాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు సంచలన తీర్పునివ్వడంతో అప్పటి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికి సిద్ధపడిందని పేర్కొన్నారు. ఆ చీకటి రోజుల్లో పత్రికల గొంతు నొక్కారని, ప్రధాన పత్రికలకు విద్యుత్ సరఫరా నిలిపివేసి కఠినమైన సెన్సార్షిప్ విధించారని శ్రీనివాస వర్మ గుర్తుచేశారు. ప్రభుత్వాన్ని విమర్శించే జర్నలిస్టులను జైళ్లలో నిర్బంధించారని తెలిపారు. దేశం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన అటల్ బిహారీ వాజ్పేయి, లాల్ కృష్ణ అద్వానీ, వెంకయ్య నాయుడు, లోక్నాయక్ జయప్రకాశ్ నారాయణ్ వంటి నాయకులతోపాటు ప్రతిపక్షాలకు చెందిన వేలాది మంది కార్యకర్తలను జైళ్లలో బంధించి చిత్రహింసలకు గురిచేశారని దేశభక్తికి మారుపేరైన ఆర్ఎస్ఎస్ పై నిషేధం విధించి వేలాది మంది స్వయంసేవకులను అరెస్టు చేశారని తెలిపారు. ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితంగానే దేశం మళ్లీ వెలుగులోకి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను అత్యున్నతంగా గౌరవిస్తోందని, గతంలో రాజ్యాంగాన్ని ఏ విధంగా అవహేళన చేశారో నేటి యువతకు తెలియజేయడానికే, ఎమర్జెన్సీ విధించిన జూన్ 25వ తేదీని కేంద్ర ప్రభుత్వం 'సంవిధాన్ హత్యా దివస్' గా ప్రకటించిందని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా సెల్ సభ్యులు కపర్ది, జిల్లా ఉపాధ్యక్షుడు పులపర్తి వెంకటేశ్వర్లు, నాయకులు నార్ని తాతాజీ, ఇంజేటి వెంకటేశ్వర్లు, తోట గంగరాజు, గన్నబత్తుల సత్యవతి తదితరుల పాల్గొన్నారు

# అంతు పట్టని పవన్ కళ్యాణ్ అంతర్గత వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి శ్రేణులు కూడా అంతర్మాదనంలో పడ్డాయని సమాచారం.

**15 సంవత్సరాలు గడువు ఇద్దరి మధ్య రహస్య ఒప్పందమా:**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రతిసారి సీఎంగా చంద్రబాబు 15 సంవత్సరాల పాటు ఉండాలని చెబుతుండడంతో కాపు సంఘాలు, జన సేన శ్రేణులు లో తీవ్ర చర్చ నీయాంశం గా మారింది. 15 సంవత్సరాల తర్వాత పవన్ కళ్యాణ్ కి సీఎంగా అవకాశం కల్పిస్తానని వారిద్దరి మధ్య జరిగిన ఒప్పందమా? ఏమిటి అనేది కాపు సంఘాలు నేతలు, జనసేన శ్రేణులు తీవ్ర చర్చకు వేసినట్లు తెలిసింది. అందుకే ప్రతిసారి 15 సంవత్సరాలు అనే మాట పవన్ కళ్యాణ్ అంటున్నారు ఏమోనని అనుమానాలు ఉన్నాయని పలువురు అంటున్నారు.

**జాతీయ, రాజకీయాల్లో పాల్గొనడం పైన చర్చ:**

పవన్ కళ్యాణ్ ఇటీవల కాలంలో జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పడంపై కూడా కాపు సంఘాలు జనసేన శ్రేణులు లో చర్చకు తెరలేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా స్థాయి నేతలతో నిత్యం టచ్ లో ఉండడం కూడా మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. పవన్ కళ్యాణ్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి కేంద్ర మంత్రి గా అయి పోతారా లేదా రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటారా అనేది కూడా కాపు, జనసేన శ్రేణులు మధ్య సంఘాలు చర్చకి తెరలేసినట్టు సమాచారం.

**మింగుడు పడని లోకేష్ సీఎం నినాదం:**

టిడిపి వర్గాల్లో పలువురు అచ్యుత్సాహకులు నెక్స్ట్ సీఎం లోకేష్ అని పదేపదే ప్రకటించడంతో ఏపీ లోని కాపు సంఘ నేతలు, జనసేన శ్రేణులు కు మింగుడు పడని పరిస్థితి నెలకొంది.సిఎం తర్వాత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కాబట్టి పవన్ కి ఇచ్చిన తర్వాత లోకేష్ కి ఇవ్వాలి కానీ ముందే లోకేష్ కి ఇవ్వాలని కోరడమేమిటిని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**100 సీట్లు కోసం వత్తిడి కై సిద్ధం ::**

రాబోయే 2029 ఎన్నికల్లో 100 సీట్లు కూటమి పార్టీ నుండి జనసేన పార్టీ కి తీసుకునే విధంగా పవన్ కళ్యాణ్పై తీవ్ర ఒత్తిడి తెచ్చేందుకు కాపు సంఘాల ప్రతి నిధులు, జనసేన శ్రేణులు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇలా చేస్తే తమిళనాడులో విజయ్ సాధించిన విజయం మాదిరిగా పవన్ కళ్యాణ్ సీఎం అవ్వడానికి ఉంటాయని దీనికోసం ఆరు నూరైనా కూటమి పార్టీని ఒప్పించాలని ఈ రెండు వర్గాలు అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నిర్ణయానికి పవన్ కళ్యాణ్ ఒప్పుకోకపోతే అవసరమైతే పవన్ కళ్యాణ్తో తెగ తెం పులు చేసుకోవడానికైనా వెనుకాడబోమని తెలుస్తోంది.

# వెనెజువెలా కోసం ఆపరేషన్ అమిస్టాడ్!

**ఢిల్లీ, జూన్ 26:** భూకంపంతో అతలాకుతలమైన వెనెజువెలాకు ఆయా దేశాలు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా లాటిన్ అమెరికా దేశానికి ఆపన్న హస్తం అందించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం 'ఆపరేషన్ అమిస్టాడ్'కొనసాగుతోందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ వెల్లడించారు. ఇందులో భాగంగా సహాయక చర్యలకు అవసరమైన సామగ్రితో భారత సైన్యానికి చెందిన రెండు సీ17 విమానాలు బయలుదేరినట్లు చెప్పారు. భారత సైన్యానికి చెందిన ఫీల్ హాస్పిటల్ యూనిట్, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించే సామర్థ్యమున్న రెండు మొబైల్ ఆసుపత్రి టెంట్లు సహా 35 టన్నులకు పైగా సహాయక సామగ్రి, ఔషధాలు, వైద్య పరికరాలు పంపించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. క్లిష్ట సమయంలో వెనెజువెలా ప్రభుత్వానికి, అక్కడి పౌరులకు అవసరమైన సాయం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అమిస్టాడ్ అంటే స్పానిష్ భాషలో స్నేహం అని అర్థం. వరుస భూకంపాల దాటికి వెనెజువెలాలో భారీ భవనాలు నేలమట్టమయ్యాయి.

# సాయికృష్ణ లాకప్ డెత్ గురించి క్రాంతి కుమార్కు తెలుసు

(మొదటి పేజీ తరువాయి)

త్వరలో తమ కార్యాచరణ ప్రకటిస్తామని దళిత సంఘాలు ప్రకటించాయి.

**పేరుపోగు వెంకటేశ్వరరావు, క్రాంతి కుమార్ తండ్రి**

విజయవాడలో సాయికృష్ణ హత్య జరిగిన సమయంలోనే నా బిడ్డ క్రాంతి కుమార్ మేం ఇంట్లో లేని సమయంలో కృష్ణలంక సీఐ నాగరాజు వేధింపులు తట్టుకోలేక విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. విజయవాడలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో దళితులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. సాయికృష్ణ ఘటన తర్వాత చంద్రబాబు వారి కుటుంబ సభ్యుల్ని పిలిపించి మాట్లాడారు. కానీ మిమ్మల్ని మాత్రం ఇప్పటివరకూ పిలవలేదు. కాపులకు ఓ న్యాయం, ఎస్సీలకు ఓ న్యాయం చేస్తారా ? ప్రభుత్వం కులమతాలకు అతీతంగా పనిచేయాలి. ఓ ఉద్యమ నాయకుడి విషయంలో నా పరిస్థితే ఇలా ఉంటే సాధారణ ప్రజల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నాం. ఇప్పటివరకూ నా కుమారుడి మరణం తర్వాత ఏ ఒక్క అధికార పార్టీ నాయకులు మా కుటుంబాన్ని పరామర్శించలేదు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు నా కుమారుడి కేసుపై స్పందించి చర్యలు తీసుకోవాలి. మాకు న్యాయం చేయాలి.

**హర్షకుమార్, మాజీ ఎంపీ**

క్రాంతి కుమార్ ఘటన ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం. మే 9న సాయికృష్ణ కనిపించకుండా పోయాడు, ఏమయ్యాడో తెలియదు, ఏం చేశారో తెలియదు. ఆయన తల్లి స్టేషన్ కు వెళ్లినప్పుడు కొడుకు అరుపులు విన్నారు. పోలీసుల్ని బతిమాలుకున్నా ఫలితం లేదు. రోజూ స్టేషన్ కు తిప్పారు. ఆ తర్వాత చంపేశారంటున్నారు. క్రాంతి కుమార్ చనిపోయే నాటికి సాయికృష్ణను ఎంత దారుణంగా కొట్టి చంపారో తెలుసు. అందుకే పోలీసులు రమ్మంటే ఇంట్లో ఉన్న క్రాంతి కుమార్ .. తనను కూడా చంపేస్తారని తల్లికి చెప్పాడు. చివరికి వేధింపులకు భయపడి గుళికలు తిని చనిపోయాడు. సాయికృష్ణ ఎలా చనిపోయాడో తెలుసు కాబట్టే క్రాంతి కుమార్ ఇలా ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరిని పొట్టనబెట్టుకున్న సీఐ నాగరాజు వంటి వాడికి మద్దతుగా కొందరు గాడిదలు తయారయ్యారు. వీళ్లు ఎంత డబ్బులు తీసుకుని నాగరాజుకు మద్దతుగా వచ్చారంటే వీరికి అసలు సిగ్గుందా ? పైగా క్రాంతి కుమార్ అమ్మాయిల్ని ఏడిపిస్తారని, డ్రగ్స్ తీసుకుంటాడని అవాకులు, చవాకులు పేలుతున్నారు. క్రాంతి కుమార్ కు ఓ కుటుంబం ఉంది, భార్యా పిల్లలు ఉన్నారన్న విషయం వీరు గుర్తించుకోలేదు. సీఐ నాగరాజులా కోట్ల రూపాయల ఆస్తులు వెంకటేశ్వరావుకు లేదు. సాయికృష్ణ కుటుంబాన్ని జగన్మోహన్ రెడ్డి పరామర్శించగానే కూటమి పార్టీలు అలర్ట్ అయ్యారు. కాపు నేతల్ని మోహరించడం మొదలుపెట్టారు. కానీ క్రాంతి కుమార్ కుటుంబాన్ని ఇప్పటికీ కూటమి పార్టీలు పరామర్శించడం లేదు.

# చంద్రగిరి కూటమిలో అంతర్గత విభేదాలు



- **అతిపెద్ద అవినీతి పరుడు పులివర్తి నాని**
- **అభివృద్ధి పని చేయాలన్నా నానీకి ముడుపు చేరాలి**

**తిరుపతి జూన్ 26 మనం న్యూస్:** చంద్రగిరి కూటమిలో కుదుపులు మొదలై అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఇప్పటికే జనసేన నాయకుల నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నానిపై తాజాగా కూటమి భాగస్వామి బీజేపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి మేడసాని పురుషోత్తం నాయుడు తీవ్ర ఆరోపణలు చేశారు. ఎమ్మెల్యే నానిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్లో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జాతీయ రహదారి విస్తరణ పనుల కాంట్రాక్టు కొనసాగించేందుకు తన నుంచి నెలకు రూ.10 లక్షల చొప్పున కప్పం వసూలు చేశారని ఆరోపించారు. ఈ మొత్తాన్ని టీడీపీ తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్రెడ్డి ద్వారా చెల్లించాల్సి వచ్చిందని, ఇప్పటివరకు రూ.29 లక్షలు చెల్లించానని పేర్కొన్నారు.

# హంసవాహనంపై సరస్వతీ స్వరూపంలో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి

- **అప్పలాయగుంట బ్రహ్మోత్సవాల్లో జ్ఞానభక్తి వైభవం**

**తిరుపతి జూన్26మనం న్యూస్:** అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు రెండో రోజు శుక్రవారం రాత్రి అపూర్వ ఆధ్యాత్మిక శోభతో కొనసాగాయి.

శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు సరస్వతీ అలంకారంలో హంసవాహనంపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటాలు, గోవింద నామస్మరణల మధ్య వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది.వీణ ధరించి సరస్వతీ అలంకారంలో దివ్య దర్శనంవీణను ధరించి సరస్వతీ అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు భక్తులను విశేషంగా అనుగ్రహించారు. హంస మంచి, చెడులను గుర్తించి మంచిదానినే స్వీకరించే జ్ఞానానికి ప్రతీక. సరస్వతీదేవి వాహనమైన హంసపై విహరించిన స్వామివారు భక్తులు నిర్మలమైన మనస్సుతో, మంచి ఆలోచనలతో జీవించాలని, అలాంటి వారి హృదయాల్లో తాను ఎల్లప్పుడూ కొలువై ఉంటాననే దివ్య సందేశాన్ని అందించారు. భక్తి, సంగీతం, వేదఘోషల నడుమ దివ్యోత్సవంవేదఘోషలు, మంగళవాయిద్యాలు, భజన మండళ్ల గానామృతం, కోలాటాల మధ్య సాగిన హంసవాహన సేవ భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. స్వామివారి దివ్యరూపాన్ని దర్శించిన భక్తులు గోవింద



నామస్మరణతో మాడవీధులను మారుమోగించారు. శనివారం ఉదయం సింహవాహనం రాత్రి ముత్యపు పందిరి వాహనంపై దివ్యమంగళ విహారం బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శనివారం ఉదయం 8.00 గంటలకు సింహవాహనంపై, రాత్రి 7.00 గంటలకు ముత్యపు పందిరి వాహనంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారు దివ్యమంగళ విహారం చేస్తూ భక్తులకు కరుణాకటాక్షాలు ప్రసాదించారు. ఈ దివ్య వాహనసేవల్లో పాల్గొని స్వామివారి అనుగ్రహాన్ని పొందాలని టిటిడి భక్తులను కోరుతోంది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఎస్.ఈ. నరసింహమూర్తి, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్లు శ్రీవాణి, సురేష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయంలో పలు నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా

**పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్, ప్రధాన ప్రవేశ ద్వారం కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు భూమిపూజ నిర్వహణ.**

**కమాండ్ అండ్ కంట్రోల్ వ్యవస్థ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, సైబర్ నేరాల, మాదకద్రవ్యాల నిర్మూలన చర్యలపై డీజీపీ సమీక్ష.**

**తిరుపతి జూన్ 26 మనం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) హరీష్ కుమార్ గుప్తా, శాంతిభద్రతల విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మధుసూదన్ రెడ్డి, ఈరోజు తిరుపతి జిల్లా పోలీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పోలీస్ సంక్షేమానికి సంబంధించిన పలు మౌలిక వసతుల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. పోలీస్ వెల్ఫేర్ క్యాంటీన్, ప్రధాన ప్రవేశ ద్వారం (గ్రౌండ్ గేట్), కాంపౌండ్ వాల్ నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సతీమణి కూడా పాల్గొన్నారు.అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీజీపీ అదనపు డీజీపీ తో కలిసి జిల్లా పోలీసింగ్, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, ప్రజా భద్రత, పోలీస్ సంక్షేమం తదితర అంశాలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, జిల్లాలో అమలవుతున్న పరిపాలనా చర్యలు, పోలీసింగ్ విధానాలు, శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. సమావేశంలో జిల్లా



అదనపు ఎస్పీలు, డీఎస్పీలు మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.సమీక్ష సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా జరుగుతున్న పర్యవేక్షణ, సీసీ కెమెరాల వినియోగం, పటిష్ట నైట్ బీట్ వ్యవస్థ, ఇంటిగ్రేటెడ్ పోలీసింగ్, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై డీజీపీ క్షుణ్ణంగా సమీక్షించారు. ప్రజా భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, జిల్లాలో డ్రోన్ సాంకేతికతను నేర నియంత్రణ, జనసమ్మర్థ నిర్వహణ, ప్రత్యేక ఆపరేషన్లలో సమర్థవంతంగా వినియోగిస్తున్న విధానాన్ని వివరించారు. అదేవిధంగా మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ప్రతి సబ్ డివిజన్ పరిధిలో సర్కిల్ వారీగా నిరంతర డ్రగ్స్, గంజాయి నిరోధక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు, డ్రగ్ టెస్టింగ్ నిర్వహిస్తూ యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా తీసుకుంటున్న చర్యలను వివరించారు.ఇటీవల జిల్లా కలెక్టర్తో కలిసి నిర్వహించిన రహదారి భద్రత బస్సు యాత్ర, ప్రమాదాలకు గురయ్యే (బ్లాక్ స్పాట్స్) ప్రాంతాల గుర్తింపు, ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాల వివరాలను కూడా ఎస్పీ డీజీపీకి వివరించారు. మహిళల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, శక్తి టీమ్ ద్వారా మహిళలకు తక్షణ స్పందన, అవగాహన కార్యక్రమాలు, భద్రతా చర్యలు సమర్థవంతంగా అమలవుతున్నాయని ఎస్పీ వివరించారు.సైబర్ నేరాల నియంత్రణలో తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన సైబర్ సోషల్ మీడియా మానిటరింగ్ వ్యవస్థ చురుకుగా పనిచేస్తోందని డీజీపీ గారు ప్రశంసించారు. అలాగే యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా నిరంతర డ్రగ్ టెస్టింగ్, ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని సన్మార్గంలో నడిపించే దిశగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను అభినందించారు.జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, సాంకేతిక ఆధారిత ఆధునిక పోలీసింగ్, పోలీస్ సంక్షేమం, ప్రజా సేవల మెరుగుదల దిశగా తిరుపతి జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను డీజీపీ అభినందిస్తూ, ఇదే స్ఫూర్తితో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# సర్ ప్రక్రియ పె సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి

- **జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్**

**తిరుపతి జూన్ 26 మనం న్యూస్:** ఎస్ ఐ ఆర్ లో భాగంగా ఓటర్ల నమోదు, ధృవీకరణ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ .వెంకటేశ్వర్ తెలిపారు శుక్రవారం ఉదయం తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు శంకర్ నాయుడు కాలనీ ముత్యాలమ్మ గుడి వీధి లో , వసుంధర నగర్ లో విస్తృతంగా పర్యటించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేసి జిల్లాలో నమోదు శాతాన్ని గణనీయంగా పెంచేందుకు అధికారులు, బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరించడంతో పాటు ఎన్రోల్మెంట్ ఫారాలను తప్పనిసరిగా అందజేసి వాళ్లకు అర్థమయ్యేలా వివరించి పారాలను పూరించడంలో సహకరించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న సర్ ప్రక్రియ పురోగతిని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. బీఎల్వోలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని సర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్లకు స్వయంగా ఎన్రోల్మెంట్ ఫారాలను అందజేశారు. ఇంటింటి సర్వే



సందర్భంగా 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుని ప్రస్తుతం ఆ గృహాల్లో నివసిస్తున్న ఓటర్ల వివరాలను సరిపోల్చాలని కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ ఉప కమిషనర్ అమరయ్య, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు, ఎలక్షన్ డి టి సుధాకర్ నాయక్ రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పుత్తూరు డీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన రాష్ట్ర డీజీపీ



- **పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన డీజీపీ**
- **ప్రజలకు మరింత సమర్ధవంతమైన పోలీసు సేవలు అందించాలని అధికారులకు దిశానిర్దేశం**

**పుత్తూరు జూన్ 26 మనం న్యూస్:** తిరుపతి జిల్లా పుత్తూరు సబ్ డివిజన్లో నూతనంగా నిర్మించిన డీఎస్పీ కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్) మధుసూదన్ రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, పుత్తూరు ఎమ్మెల్యే భాను ప్రకాష్, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, జిల్లా పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించిన రాష్ట్ర డీజీపీ ఆధునిక సౌకర్యాలతో కూడిన ఈ కార్యాలయం ద్వారా పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు.అనంతరం పుత్తూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులతో రాష్ట్ర డీజీపీ సమీక్ష సమావేశం నిర్వహించారు.

శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మహిళలు, చిన్నారుల భద్రత, ప్రజలకు అందించే పోలీసు సేవల నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు పోలీసు శాఖపై మరింత విశ్వాసం పెరిగేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందనతో చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీ పోలీసు అధికారులకు సూచించారు. తిరుపతి జిల్లా పోలీసు శాఖ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా పనిచేస్తుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# జూలై 1న శ్రీ సిటీలో హీరో మోటోకార్ప్ రెండో గ్లోబల్ పార్ట్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి

- **ముందస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ**

**శ్రీసిటీ, జూన్ 26 మనం న్యూస్:** జూలై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు శ్రీ సిటీలో హీరో మోటార్ కార్ప్ ఏర్పాటు చేయనున్న తమ రెండవ గ్లోబల్ పారట్స్ సెంటర్ కు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బ రాయుడు , అధికారులు కంపెనీ ప్రతినిధులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను ఎలిప్యాడ్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా వేదిక ఏర్పాటు, ముఖ్యమంత్రి రాకపోకల మార్గం, భద్రతా ఏర్పాట్లు,అలాగే, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో హీరో మోటోకార్ప్ సంస్థ ప్రతినిధులు, శ్రీ సిటీ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్ అంధకారమే

- **అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**

**మదనపల్లి, జూన్ 26,మనంన్యూస్:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మదనపల్లెలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం ఆవరణంలో శుక్రవారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆధ్వర్యంలో విద్యార్థులు, ప్రజలతో కలిసి భారీ అవగాహన సదస్సు, నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూమాదకద్రవ్యాలు సేవించినా, విక్రయించినా కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తాం. డ్రగ్స్ కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కోల్పోవడంతో పాటు



పాస్పోర్ట్ కూడా లభించదని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో 'కూల్ లిప్స్' లాంటివి అమ్మితే కఠిన చర్యలు తప్పవు. ఉపాధ్యాయులు సైతం అప్రమత్తంగా ఉండి విద్యార్థుల బ్యాగులను తనిఖీ చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లకు 'డ్రగ్ టెస్టింగ్ కిట్స్' సరఫరా చేశాం. అనుమానితులకు తనిఖీలు చేసి, డ్రగ్స్ తీసుకున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం అని పేర్కొన్నారు. మత్తు పదార్థాల విక్రయాలపై ప్రజలు నిర్భయంగా 1972 కు సమాచారం అందించాలి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.మత్తు రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి కోరారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల చేత మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఇదే స్ఫూర్తితో జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోనూ యాంటీ డ్రగ్ ర్యాలీలను విజయవంతంగా నిర్వహించారు.

# మాదకద్రవ్యాలు, ఫైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



**జూపాడుబంగ్లా జూన్ 26 (మనం న్యూస్)** నంద్యాల జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆత్మకూరు ఎస్ డి పి ఓ ఉత్తర్వుల మేరకు, నందికొట్కూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. సుబ్రమణ్యం, జూపాడుబంగ్లా, ఎస్సై కే మల్లిఖార్జున, 26. తేదీ శుక్రవారం జూపాడుబంగ్లా డి ఆర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు విద్యార్థులకు మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి, విద్యార్థులలో మత్తుపదార్థాల దుర్వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక మరియు చట్టపరమైన పరిణామాల గురించి యువతకు అవగాహన కల్పించడంతో పాటు, మాదకద్రవ్యాలు వాడటం వలన మెదడు పనితీరును, వ్యక్తిగత లక్ష్యాలను నేరుగా ఎలా చెడు ప్రభావితం చేస్తాయో తెలిపి అందరికి శక్తి యాప్ గురించి శక్తి యాప్ నంబర్ 7993485111 ను తెలిపి, బాల్యవివాహాలు చిన్న పిల్లలపై నేరాలు జరిగినచో 1098 ఫిర్యాదు చేయవలెనని, పోక్సో కేసుల పై అవగాహన కల్పించి, వుమన్ వెల్ఫేర్ 181 ఎమర్జెన్సీ కాల్ 100, 112 ల గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనడం జరిగినది

# కూటమి ప్రభుత్వానికి స్ఫూర్తి దివ్యాంగుల స్వచ్ఛంద సేవ కమిటీ కృతజ్ఞతలు

**బేతంచేర్ల జూన్ 26 మనం న్యూస్** రాష్ట్ర కూటమి ప్రభుత్వం సీఎం నరచంద్రబాబు నాయుడు కీ రాష్ట్రము లోని దివ్యంగుల తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ బేతంచెర్ల స్ఫూర్తి దివ్యంగుల స్వచంద సేవ సంస్థ అధ్యక్షులు కార్యదర్శి పీట్ల మద్దిలేటి రాముడు తెలిపారు ఈసందర్భంగా వారు సమావేశం మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం మరియు రాష్ట్రకూటమి ప్రభుత్వం దివ్యంగులకోసం అహర్నిశలు కష్టాన్ని చూసి ఇది నాభాధ్యత అని తన బుజాలమీద వేసుకొని దివ్యంగులకు కర్నూలు లో కృత్రిమ అవయువాలు తయారీ కేంద్రం మంజూరు చేయించారు దివ్యంగులకు కృత్రిమ చెయ్ వీల్ చైర్స్ వినికిడి పరికరాలు తయారు చేయుటకు మనం ఉమ్మడి జిల్లా కర్నూలు కు కేంద్రం కృషి సీఎం ద్వారా దీనివల్ల అనేక మంది దివ్యంగులు ఉపాధి పరంగా గాని మరియు వ్యాపారాలు



చేసుకోవడానికి గాని ఉద్యోగాలు చేసుకునిగా సులువుగా నడవటానికి మేముకూడా సకాలంగులు కు దీటుగా సమానంగా ఉంటుందని చెప్పి ఆనంద వ్యక్తం చేస్తున్నాము సీఎం నారా చంద్రబాబు కి నారా లోకేష్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు ఈకార్యక్రమంలో శకుంతల సురేష్ శ్రీను మ్యారెప్ప రామాంజనేయులు మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు

# వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని సీఎంకు వినతి

రాష్ట్ర ఐక్య వాల్మీకి ఐక్య పోరాట కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు. మంత్రాలయం జూన్ 26,మనం న్యూస్.. వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు వినతి పత్రం సమర్పించినట్లు రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట కమిటీ అధ్యక్షుడు వాల్మీకి లక్ష్మన్న తెలిపారు. గురువారం మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి విచ్చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు అందుకు స్పందించిన సీఎం, కేంద్రంతో సంప్రదించి పెండింగ్లో ఉన్న




బిల్లును ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నామన్నారు ఏపీలో 50 లక్షల మంది వాల్మీకి బోయలు ఉన్నారని తెలిపారు. బోయలు అభివృద్ధి చెందాలంటే విద్యా ఉద్యోగ రాజకీయం సామాజికంగా అభివృద్ధి చెందాలంటే ఎస్టి జాబితాలో చేర్చాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జగ్గాపురం ఈరన్న బిజెపి ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు బివి రవిచంద్ర పాల్గొన్నారు.

# రామమ్మ పేటలో తాగునీరు కటకట

**దేవనకొండ మనం న్యూస్** మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామంలోని రామమ్మ పేటలో తమ్మి దొడ్డయ్య స్వామి దేవాలయానికి వెళ్లి రహదారిలో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలోని ప్రజలే కాక దేవాలయానికి వచ్చే భక్తులకు, కాలినడకన వచ్చే భక్తులకు తాగునీరు లేక విలవిలా లాడుతున్నారు. ఈ విషయంపై అధికారులకు పలువార్లు అర్జీలు సమర్పించిన పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో తాగునీటిని కిలోమీటర్ వెళ్లి తెచ్చుకోవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా అధికార స్పందించి దేవాలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని భక్తులు, ప్రజలు కోరుతున్నారు

# బూత్ స్థాయి అధికారీ వీఆర్వో సర్వే



**జూన్ 26మనం న్యూస్ :-** జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ఓటర్లు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా స్థానిక తహశీల్దార్ శ్రీనివాసులు ఆదేశాల మండల పరిధిలోని ఏనుగుబాలగ్రామంలో మేరకు 70 బూత్ స్థాయి అధికారీ బి ఎల్ ఓ బి. గోపాల్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి వచ్చే నెల 14 తేది వరకు నిర్వహించునున్న ఇంటింటా ఎన్యుమరేషన్ ప్రక్రియలో తీసుకోవాలసిన జాగ్రత్తలు వివరించారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తనిఖీలు నిర్వహించాలని ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరు కు ఎన్యుమరేషన్ ఫారం ఇచ్చి సదరు ఓటరు వివరాలను సరిచూసుకొని ఓటరు సంతకం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్క ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు, మరణించిన , డబుల్ ఎంట్రీ, గ్రామం పూర్తిగా వదిలివెళ్లిన వారి వివరాలను బిఎల్వో సమక్షంలో విచారణ చేసి తొలగించేందుకు సిఫారసు చేయాలని బూత్ స్థాయి అధికారీ వీఆర్వో గోపాల్ తెలిపారు

# 'వందే' బంకించంద్ర ఛటర్జీ

బంకించంద్ర చటోపాధ్యాయ పేరు తెలియని భారతీయుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం గీత రచయితగా ఆయన యావత్భారతానికి సుపరిచితులే. ఆయన రచయిత, కవి, పాత్రికేయుడు. ఆయన వందేమాతరం మొదట సంస్కృత స్తోత్రంలో భారత దేశాన్ని మాతృదేవతగా వ్యక్తీకరించారు. ఆ గీతం ద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కార్యకర్తలను ప్రేరేపించారు.

బంగ్లా భాషలోని అగ్ర రచయితల్లో ఒకరుగా భావించే బంకిం చంద్ర చటోపాధ్యాయ తన రచనలతో కేవలం బంగాలీ సమాజాన్నే కాదు, మొత్తం దేశాన్నే ప్రభావితం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులలో ఒకరు..ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన పంతొమిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేసారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింప చేసిన సంఘటన, బంకించంద్రుడి విషయంలో లాగ మరొక దేశంలో, మరొక దేశ చరిత్రలో చోటు చేసుకోలేదనేది వాస్తవం.

బంకించంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని. ఆయన ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా భారత దేశంలో ప్రథమ స్వతంత్ర సంగ్రామం జరిగిన 1857లోనే బీఏ ఉత్తీర్ణులు అయ్యారు. బెంగాల్లో మొదటగా బి.ఏ డిగ్రీ పొందిన వ్యక్తి ఈయనే కావడం విశేషం. 1869లో ఆయన లా డిగ్రీ అందుకున్నారు. స్వస్థాన వేష భాషల పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఇరవై ఏళ్ళు నిండకముందే 'లలిత ఓ మానస్' అనే కవితా సంపుటి రచించాడు. దుర్గేశ్ నందిని, కపాల కుండల, మృణాళిని, దేవీ చౌధురాణి మున్నగు 15 నవలలు ఆయన రాశారు.

బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 - 8 ఏప్రిల్, 1894) రచన వందేమాతరం గీతాన్ని ఆనంద్‌మఠ్ అనే నవల నుండి సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. దేశమంతటా ప్రతిధ్వనించిన నినాద మయింది.



**దేశాన్ని మాతృమూర్తిగా సంబో ధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, 'వందేమాతరం' గీత రచన చేసిన ర తర్వాత దానిని 'ఆనంద్‌మఠ్' నవలలో పొందు పరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించబడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు.**

దేశాన్ని మాతృమూర్తిగా సంబో ధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, 'వందేమాతరం' గీత రచన చేసిన తర్వాత దానిని 'ఆనంద్‌మఠ్' నవలలో పొందుపరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించ బడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు.

భారతదేశ స్వాతంత్ర్య ఆకాంక్ష ప్రజల్లో చైతన్య వంత మవుతున్నప్పుడు వందేమాతరం గీతం ఆ చైతన్యాన్ని వేగవంతం చేసింది. సమరోత్సాహాన్ని త్వరితం చేసింది. ఆయన సాహిత్య ప్రతిభ బహు ముఖమైనది. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్క ృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం.

మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని అయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం, దేశ భక్తి అనంతం, అపూర్వం. ఆనంద మఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైన, సాహసానికైన ప్రతీకలుగా ఉన్నాయి. ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావకతను, ఆలంబనం చేసుకొని రచనలు సాగించాడు అని కొందరు సాహితీవేత్తల భావన. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రలు సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతుల మధ్య అవి జీవిస్తాయి. అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకు ఏమాత్రం తీసిపోరు అని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు, బంకించంద్ర ఛటో పాధ్యాయను ప్రసంసించారు.

జూన్ 27...బంకించంద్ర ఛటర్జీ జయంతి

-ఆర్‌కేఎస్
9440595494

# దౌత్యంలో మహిళల ప్రాతినిధ్యం పెంచలేమా !





ఐక్యరాజ్య సమితి తీర్మానం ప్రకారం, ప్రతి ఏటా 24 జూన్ రోజు ప్రపంచ దేశాలు అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ వూమెన్ ఇన్ డిప్లమసీ) పాటించడం 2022 నుంచి ఆనవాయితీగా మారింది. మహిళలు నిర్ణయాధికార స్థానాల్లో ఉండేలా, వారి గొంతు వినిపిం చేలా, వారి కృషికి విలువ ఉండేలా చూసే దశకు మనందరం సాధ్యమైనంతగా కృషి చేయాలని పిలుపునిస్తున్నది ఈ వేదిక. అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం-2026 ఇతివృత్తంగా అందరి కోసం దౌత్యం (డిప్లమసీ ఫర్ ఆల్) అనే అంశాన్ని తీసుకొని సమాజ వైవిధ్యాన్ని ప్రతిబింబించే సమానత్వ సాధన, శాంతి సహకారాలకు ప్రాధాన్యం ఇస్తూ సమ్మిళిత దౌత్యం కోసం పిలుపునిస్తూ ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో లింగ సమానత్వం, అసమానతల తగ్గింపు, శాంతి న్యాయ సంస్థలు, లక్ష్యాల సాధనకు భాగస్వామ్యం లాంటి అంశాలను అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం వేదికగా గుర్తు చేసుకోవాలి.

ప్రపంచవ్యాప్తంగా దౌత్య రంగంలో మహిళల నాయకత్వ ప్రాతినిధ్యం గణనీయంగా తక్కువగా ఉండడం విచారకరం. క్యాబినెట్ మంత్రులు, విదేశీ వ్యవహారాలు, రక్షణ, భద్రత లాంటి మంత్రిత్వ శాఖల్లో లేదా ఉన్నత రాయబార అధికారుల స్థాయిలో మహిళలు నాలుగింట ఒక వంతు కన్న తక్కువగా 22.9 శాతం మాత్రమే ఉండడం ఓ చేదు నిజం అని తెలుసు కోవాలి.

లింగ సమానత్వంలో కొంత పురోగతి సాధించి నప్పటికీ, దౌత్య అంతర్జాతీయ స్థాయిల్లో మహిళల ప్రాతినిధ్యం పరిమితంగా ఉండడంతో ఆ రంగాల్లో మహిళామణులను ఆకర్షించడానికి ప్రభుత్వాలు, పౌర సమాజం ముందుకు రావాలి. కేవలం 25 దేశాల్లో మాత్రమే మహిళా దేశాధినేత లేదా ప్రభుత్వాధినేతలు ఉన్నారు. 113 ప్రపంచ దేశాల్లో ఇప్పటి వరకు దేశాధినేతలు లేదా ప్రభుత్వ ఉన్నత స్థానాల్లో మహిళలకు స్థానం దక్కలేదు. ఐరాస నియమించిన దౌత్య రంగంలో మహిళలు 21 శాతం వరకు మాత్రమే ఉండడం గమనించాలి. రాజకీయ రంగంలో ఆసక్తి చూపుతున్న మహిళలకు ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ వేధింపులు దినదినం పెరుగుతున్నాయి.అంతర్జాతీయ దౌత్య రంగంలో మహిళల దినోత్సవం వేదికగా ఐరాస తీసుకునే చర్యలతో పాటు ఈ అంశంలో ప్రజా అవగాహన, కమ్యూనిటీ ఫోరమ్లు, శిక్షణ కార్యక్రమాలు, యూనివర్సిటీల్లో మహిళా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

రాజకీయ నియామకాలు, దౌత్య కార్యాలయాల్లో లింగ సమానత్వ సాధనకు కృషి జరగాలి. దౌత్య రంగంలో రాణిస్తున్న మహిళలను సముచితంగా గౌరవిస్తూ, వారిని ప్రజా క్షేత్రంలో సన్మానించాలి. ప్రపంచ శాంతి, సమ్మిళిత ప్రపంచ పాలన, సమాన భాగస్వామ్య సాధన లాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి.

**డా.బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

## ఇపుడీ లోకంలో...

'హెల్ ఈజ్ ఎంప్టీ,
అండ్ ఆల్ ద డెవిల్స్ ఆర్ హియర్'
'నరక మంతా శూన్యంగా ఉంది,
దయ్యా లన్నీ ఇక్కడే(ఈ లోకంలోనే) ఉన్నాయి'
అన్నాడు పదహారో శతాబ్దంలోని
ప్రముఖ నాటకకర్త,కవీ విలియం షేక్స్పియర్!
ఈ మాట నూటికి ఎన్నెన్నో రెట్ల నిజం!
ఈ లోకంలో వాళ్ళ యమభయం లేదు కాబట్టి,
మరణమూ లేదు కాబట్టి
మనుషుల్లో ఆవేశిస్తూ తమ దయ్యపు గుణాలను
మనుషులకు నేర్పిస్తూ,దుర్బుద్ధులు
పుష్కలంగా పుట్టిస్తూ,
చనిపోతున్న మనుషుల వదిలిపెట్టి
పుడుతున్న మనుషుల్లోనూ ప్రవేశిస్తూ
ఆ దయ్యాలు తామే మనుషులుగా
ఇప్పటికీ నిర్భయంగా వర్ధిల్లుతున్నాయి,
ఇందుకే మనుషుల్లో ..క్రూరమృగాల
కరళ్ళు కరళ్ళుగా తోటిమనుషులపై క్రూరత్వం!
ఇపుడీ లోకంలో... ఎక్కడ చూసినా
దుర్మార్గమే గర్వంగా
మీసాలు మెలేస్తూన్న అహంకారఘట్టాలు;
లోకం దృష్టి చాలా మందమైపోయింది,
న్యాయాన్యాయాలనూ,ధర్మాధర్మాలనూ
పాపపుణ్యాలను అసలు గుర్తించడం లేదు,
ముందే ఘోరాలూ,నేరాలూ జరుగుతున్నా
వేడుకదృశ్యాలుగా చూస్తూంది లోకం,
కోటిరావణ,మైరావణసమానశ్వేతవస్త్రధారికి
అన్ని వ్యవస్థలూ దాసోహ మంటున్నాయి
కొంపలు ముంచే తెలివితేటలకే కీర్తికిరీటాలను
తొడుగుతోంది లోకం, నీతీనిజాయితీ
పరులను చూసి ఎగతాళిగా నవ్వుతోంది లోకం
చట్టాలూ న్యాయాదులు బలాలున్నవాళ్ళకే
చుట్టాలవుతున్నాయి
దొడ్డవాడికి రక్షలు, బక్కవాడికి శిక్షలు
మొన్నా,నిన్నా,నేడూ
అమాయకుల,పేదల,నిరుపేదల,
తెలివిలేనివాళ్ళ,బలహీనుల బ్రతుకులే బలి!

-'రఘువర్మ'
9290093933

# శనీశ్వర పూజతో అంతా శుభమే

**'నీలాంజన సమాభాసం ! రవిపుత్రం యమాగ్రజం..**
**ఛాయా మార్తాండ సంభూతం ! తం నమామి శనైశ్చరమ్' !**

భారతీయుల జ్యోతిషశాస్త్రం ప్రకారం 'శనీశ్వరుడు', నవగ్రహాలలో ఒక గ్రహం. సూర్యుడు, చంద్రుడు, ఛాయా గ్రహాలైన రాహువు, కేతువులతో కలిపి గ్రహాలు తొమ్మిది. గగన మండలంలో ఉన్నగ్రహాలకు భూమితో సంబంధం ఉంది. కాబట్టి తొమ్మిది గ్రహాల ప్రభావం భూమి మీద, భూమిపై ఉన్న ప్రతి చరాచర జీవుల పైన, నిర్జీవ, ఝడ, నిర్లిప్త వస్తువుల మీద వుంటుంది. నవగ్రహాలలో ఒకటైన శని గ్రహం ఇందుకు భిన్నం కాదు. శని, శనిగ్రహం, శనేశ్వరుడు, శనీశ్వరుడు, అని పలు నామములతో పిలువబడి, గ్రహ రూపంలో పూజింపబడే 'శని' ఒక గ్రహదేవుడు. వారంలో ఏడవవారం శనివారం. శనివారానికి అధిపతి శనేశ్వరుడు. శనికి మంద గమనుడు అని కూడా పేరు. శనయే క్రమతి, అనగా అతినెమ్మదిగా కదిలేవాడు అని అర్థం. ఒకసారి సూర్యుని చుట్టి రావడా నికి శనికి 30 సంవత్సరాలు పడుతుంది. శానైస్కర్య, అసిత, సప్తర్చి, క్రూరదృష్ట, క్రూర లోచనుడు, పంగు పాదుడు, గృధ్రవాహనుడు మొదలైన పేర్లుకూడా ఉన్నాయి.

సంఖ్యలలో 'ఎనిమిది' శనికి ప్రీతికర మయిన సంఖ్య. ఛాయదేవికి పుట్టిన సంతానం శనిదేవుడు. ఆయనకు ఛాయాపుత్రుడు అనే పేరు కూడా ఉంది. జీవుల జాతక చక్రాలపైన తన ప్రభావాన్ని ఎలా చూపబోతున్నాడో అని నిరూపించ డానికి ఆయన జననం సూర్య గ్రహణములో జరిగింది.

దేవతల్లో శని దేవుడికి విశిష్టమైన స్థానముంది. జీవులు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తం కల్పించి, శిక్షించి, ధర్మాన్ని నిలిపే శని భగవానుడు యమధర్మరాజుకు అన్న. యముడు మరణానంతరం దండనలు విధిస్తే, శనిదేవుడు జీవులు బ్రతికి ఉండగానే హింసించి, యాతనలకు గురిచేసి శిక్షిస్తాడు. శనీశ్వరుడు గోచారస్థితి ఫలితంగా ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని, జన్మరాశి నుండి లగ్నశని, మూడు, ఏడు, పదవ స్థానాలపై శనిదేవుని ప్రభావం పడితే అనేక ఇబ్బందులను కలిగిస్తాడు.

హిందూ క్యాలెండర్ ప్రకారం వైశాఖ చతుర్దశి అనంతరం వచ్చే అమావాస్య రోజు శని జయంతి జరుపుకుంటారు. వారంలో ఒకరోజు అంటే శనివారం నాడు శనీశ్వరుడు శని గ్రహాన్ని పాలిస్తుంటాడు. సూర్యదేవుని కుమారుడైన శని.. జ్యోతిష శాస్త్రం ప్రకారం మానవుల జీవితంపై తీవ్ర ప్రభావం చూపిస్తాడు. అంతే కాకుండా ఈయన శని గ్రహానికి రాజు. శనీశ్వరుడిని భక్తి శ్రద్ధలతో కొలిచి ఆయన అనుగ్రహం పొందితే కష్టాలు దూరమై.. అదృష్టం కలిసి వస్తుంది. దుష్టశక్తుల నుంచి మనల్ని మనం కాపాడు.కోవడానికి శని దేవున్ని ప్రసన్నం చేసుకోవాలి. అంటే తైలాభిషేకం చేసి శాంతి పూజలు నిర్వహించాలి.

బ్రహ్మ వైవర్త పురాణం ప్రకారం, పార్వతీ దేవి, నలుగు పిండి బొమ్మకు ప్రాణం పోసినప్పుడు, వినాయకుడు జన్మించాడు. సకల దేవతలు, నవగ్రహాలు ఆ బాల వినాయకుడిని చూడటానికి వచ్చారు. ఆ ముగ్ధ మోహన బాలుడిని అక్కడకు విచ్చేసిన



దేవతలు, మునులు కనులార చూసి, దీవెనలు అందించి, పార్వతీ దేవికి మోదం కలిగించారు. శని భగవానుడు మాత్రం తల ఎత్తి ఆ బాలుని చూడలేదు. అందుకు పార్వతీదేవి కినుక వహించి, తన బిడ్డను చూడమని శనిని ఆదేశించింది. అయినా శని తన దృష్టి, ఆ బాలగణపతి పై సారించలేదు. తన దృష్టి పడితే ఎవరికైనా కష్టాలు తప్పవని ఎంత నచ్చచెప్పినా, మాతృ గర్వంతో శనీశ్వరుడి సదుద్దేశం తెలుసు కోలేక, పార్వతీ దేవి తనకుమారుని చూడమని పదే పదే శనిని ఆదేశించింది. శని తల ఎత్తి చూసిన కారణంగా బాల గణపతి మానవ రూపంలో ఉండే తలను కోల్పోయినాడని పురాణాలు తెలుపుతున్నాయి. శని భగవానుని జన్మ వృత్తాంతం విన్న విక్రమాదిత్యుడు ఆయనను పరిహాస మాడాడట ! ఆ పరిహాసాన్ని విన్న శని కోపగ్రస్తుడై విక్రమాదిత్యుని శపించాడట. శనిని కించపరిచే విధంగా మాటలాడి, అవమానించి నందుకు ఫలితంగా విక్రమాదిత్యుడు అనేక కష్టాలు అనుభవించాడు. రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు, చేయని దొంగతనపు నింద మోపబడి, పొరుగు రాజుచే కాళ్ళు, చేతులు నరికివేయ బడ్డాడు. చివరికి, విసిగి వేసారి పోయి, బాధలు ఏమాత్రం భరించే ఓపికలేక, నిర్వీర్యుడై, భ్రష్టుడై, చేసేదిలేక, తనను కనికరింపమని శనిదేవుని అత్యంత శ్రద్ధతో, ఆర్తితో, భక్తితో ప్రార్థించగా, విక్రమాదిత్యుని భక్తికి సంతృప్తి చెందిన శనీశ్వరుడు తిరిగి అతని పూర్వ వైభవం ప్రాప్తింప చేసాడు.

హనుమంతుడు శని దేవుడి లోని ఓంకారాన్ని నాశనం చేసినప్పుడు ఆయన శరీరం పై మచ్చలు గాయాలు అయినాయి. ఆ నొప్పి పోయి, సున్నితంగా తయారవ డానికి, హనుమంతుడు ఇచ్చిన నూనె సాయపడింది.

శని దశ దుష్ప్రభావాలతో బాధపడేవారు, భక్తితో శని దేవునికి నూనె సమర్పిస్తే చెడు ఫలితాలు పోతాయని విశ్వాసం. నువ్వుల నూనెతో శనికి అభిషేకం చేయడం, శని త్రయోదశి రోజున ఉపవాసం ఉండడం, రావిచెట్టుకి ప్రదక్షిణాలు చేసి ఆవనూనెతో దీపం పెట్టడం, నువ్వుల నూనెలో ముఖం చూసుకొని ఆ నూనెను దానం చేయడం. శని దేవతను ప్రతిబింబించే నల్ల వస్తువులను... నల్ల ధాన్యాలు, నల్ల మినపప్పు, నల్ల నూనెలు, నల్ల ఆవులు, నల్ల బట్టలు, నల్లని గొడుగు మొదలైనవి దానం చేస్తే చెడు ప్రభావాలు తొలగి పోతాయి. తాంత్రిక విద్యల ప్రభావం నుంచి రక్షణ కోసం హోమం లేదా యజ్ఞాన్ని జరిపించాలి. చీమలకు బెల్లాన్ని ఆహారంగా ఇస్తే శని సంతుష్టుడై ఉంటాడు.

శని స్తోత్రాన్ని నిత్యం పఠిస్తే భగవంతుడి ఆశీర్వాదాలు పొందుతారు. జీవితంలో క్లిష్టమైన పరిస్థితులు ఎదుర్కొంటోన్న సమయంలో సూర్య దేవుడి కుమారుడైన, శని దేవుడికి పూజ చేస్తే మంచి ఫలితాలుంటాయి. శనివారం ఉపవాసం ఉండి, శనీశ్వరుడి అనుగ్రహం పొందితే అదృష్టం కలిసి వస్తుంది.

శని మనిషి చేసిన చెడు కర్మ ఫలితాన్ని తొలగిస్తాడు. జాతక రీత్యా శని పన్నెండవ ఇంట, ఒకటవ ఇంట, రెండవ ఇంట సంచరిస్తున్నప్పుడు, దానిని 'ఏలినాటి శని' లేదా 'సాడేసాతి' అంటారు. అలాగే శని నాలుగవ ఇంట, ఎనిమిదవ యింట సంచరిస్తున్నప్పుడు కూడా చెడు ఫలితాలు ఇస్తాడు. అయితే ఈ సమయంలో శని ఇచ్చే ఫలితం తాత్కాలికంగా చెడు అనిపించినా, అది ఆ వ్యక్తి భవిష్యత్తుకు ఎంతో సహాయకారిగా ఉంటుంది. ఉదాహరణకు ఏ పని లేకుండా, ఖాళీగా తిరుగుతున్న వ్యక్తికి, ఉద్యోగం వస్తే, అది బద్ధకస్తుడు అయిన వ్యక్తికి మొదట కష్టంగా తోచినా, అది మంచి భవిష్యత్తును ఇస్తుంది. కాబట్టి ఆ తర్వాత ఆ కష్టం యొక్క విలువ తెలుస్తుంది. మనం పూర్వ జన్మలో చేసిన పాపాల ప్రయత్నాన్ని కష్టాల రూపంలో శని ఈ సమయంలో తొలగిస్తాడు. తద్వారా ఆ వ్యక్తి కి మంచి భవిష్యత్తు కలుగుతుంది.

మనం ఎంత కష్టం చేస్తే శని అంతా సంతృప్తి చెందుతాడు. కాబట్టి జాతకంలో కానీ, గోచారంలో కానీ, శని అనుకూలంగా లేని వ్యక్తులు శారీరకంగా కష్ట పడటం, అంటే ఇతరులకు సహాయం చేయడం మొదలైనవి చేస్తే ఆ చెడు ఫలితం తగ్గిపోయి శుభ ఫలితాలను శని ఇస్తాడు. శనివారానికి స్థితి కారకుడైన శ్రీమన్నారాయణుడు అధిపతి , త్రయోదశికి అధిపతి కామదేవుడు. అంటే శివుడు. అలా శివకేశవుల క్రియలకు శని అధిపతి అయ్యాడు. అందుకే శనిత్రయోదశి శనికి ఇష్టమైన రోజు. త్రయోదశి తిథి శివుడికి ఎంతో ప్రీతికరమైనది. క్షీరసాగర మదనం జరిగి అమృతం ఉద్భవించిన తరువాత, హాలా హలాన్ని దిగమింగి తన కంఠంలో దాచుకొని లోకాలను కాపాడిన శివుడికి కృతజ్ఞతలు చెప్పడానికి దేవతలందరూ ఆయన వద్దకు వెళ్ళినది ఈ త్రయోదశి తిథి నాడే అని పురాణాల ద్వారా తెలుస్తుంది.

శని త్రయోదశి ప్రదోష సమయాన శివుడికి అభిషేకం చేయడం చాల విశేషంగా లభిస్తుంది. ఈ సమయంలో శివుడికి చేసే పూజలు అత్యంత ఫలితాలనిస్తాయని శాస్త్రాలు చెబుతున్నాయి.

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# నిజాం నుంచి నేటి తెలంగాణ వరకు... ప్రజల విముక్తి ఏది?



తెలంగాణ చరిత్రను కేవలం పాల కుల చిట్టాగానో, అధికార మార్పిడిల కథనంగానో చూస్తే అది అసంపూర్ణమే అవుతుంది. ఇది రాజుల గాథ కాదు, ఇది తిరుగుబాటుదారుల గీతం. అణచివేతకు వ్యతిరేకంగా తరతరాలుగా ఎగిసిపడుతున్న చైతన్య తరంగాల చరిత్ర ఇది. ఈ నేలపై ప్రతి తరం తన కాలంలోని అన్యాయాన్ని నిర్భయంగా ప్రశ్నించింది. ఆత్మ గౌరవం కోసం, మనిషిగా హక్కుల కోసం అహరహం పోరా డింది. అయితే, నిజాం కాలం నుంచి నేటి ప్రజాస్వామ్య యుగం వరకు దశాబ్దాలు గడిచినా, పాలకులు మారారు, ప్రభుత్వాలు మారాయి, కానీ తెలంగాణ ప్రజల జీవితాల్లో 'నిజమైన విముక్తి' ఎంతవరకు సాధ్యమైందన్నది నేడు తెలంగాణ పౌర సమాజం ముందున్న అత్యంత సంక్లిష్టమైన, చారిత్రకమైన ప్రశ్న.

నిజాం పాలనను నేడు ఒక వర్గం పూర్తిగా చీకటి యుగంగా చిత్రీకరిస్తే, మరొక వర్గం దానిని అభివృద్ధి యుగంగా కీర్తిస్తోంది. వాస్తవానికి, ఈ రెండు అభిప్రాయాలు చారిత్రక వాస్తవాలను దాటవేసేవే. హైదరాబాద్ సంస్థానంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం, నిజాం సాగర్ వంటి ఆధునిక కట్టడాలు, రైల్వేలు, వైద్య సంస్థలు వెలిశాయి. కానీ, అదే సమయంలో ఆ ఆధునికత వెనుక గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దొరల నిరంకుశత్వం, వెట్టిచాకిరి, అమానవీయమైన సామాజిక అణచివేత తాండవించాయి. నగరాల్లో ఆధునిక విద్యుత్ దీపాలు వెలుగుతుంటే, పల్లెల్లో రైతాంగం దోపిడీ చీకట్లలో మగ్గిపోయింది. ఈ వైరుధ్యమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పునాది వేసింది. ఆ పోరాటం కేవలం రాజకీయ స్వాతంత్ర్యం కోసం కాదు.. మనిషిగా గౌరవం కోసం, దోపిడీని అంతం చేయడం కోసం జరిగిన ఒక సామాజిక విప్లవం.

1948లో హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడం ఒక కీలక మలుపు. ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడింది, రాజ్యాంగ హక్కులు సంక్రమించాయి. కానీ, గ్రామీణ సమాజంలోని అధికార నిర్మాణంలో ఆశించిన మార్పు రాలేదు. నిజాం కాలం నాటి భూస్వామ్య వర్గాలు కొత్త రాజకీయ పార్టీల ముసుగులో అధికారాన్ని కైవసం చేసుకున్నాయి. దొరలు, జాగీర్దారులు ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా అవతారమెత్తారు. రాజ్యం మారింది, కానీ గ్రామీణ శక్తి సంబంధాలు, దోపిడీ స్వభావం అలాగే ఉండిపోయాయి. ఆ తర్వాత 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడం తెలంగాణకు మరో పెద్ద అన్యాయానికి దారితీసింది. ప్రాంతీయ అసమానతలు, వనరుల పంపిణీలో జరిగిన వివక్ష 1969 ఉద్యమానికి బీజాలు వేశాయి. తెలంగాణకు జరిగిన అన్యాయం కేవలం ప్రాంతీయమైనది కాదు, అది వనరుల పంపిణీలో జరిగిన వర్గ అన్యాయం.

1991 తర్వాత దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన నయా ఉదారవాద ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ తెలంగాణ సామాజిక వ్యవస్థను మరింత తీవ్రంగా ప్రభావితం చేశాయి. ప్రజా రంగం బలహీనపడటంతో రైతాంగ సంక్షోభం, నిరుద్యోగం, వలసలు విలయతాండవం చేశాయి. సహజ వనరులు మార్కెట్ శక్తుల నియంత్రణలోకి వెళ్లిపోయాయి. ఈ క్రమంలోనే 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడటం ఒక చారిత్రక విజయం. కానీ, ప్రజలు కోరుకున్నది కేవలం పాలకుల మార్పు కాదు. వారు ఆశించింది ఉద్యోగాలు, భూమి, సామాజిక న్యాయం, అందరికీ సమానమైన విద్య, వైద్యం. గత దశాబ్దాన్ని పరిశీలిస్తే, అభివృద్ధి హైదరాబాద్



కేంద్రంగా, కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం సాగింది. గ్రామీణ తెలంగాణ ఇంకా సంక్షోభంలోనే ఉంది. 2023లో ప్రజలు మార్పు కోసం ఓటు వేశారు, కానీ ఇప్పటికీ పాలనా దృక్పథంలో మౌలికమైన మార్పు రాకపోవడం ప్రజలను నిరాశకు గురిచేస్తోంది. ఇక్కడే తెలంగాణ పౌర సమాజం తన చారిత్రక బాధ్యతను గుర్తించాల్సిన అవసరం ఉంది. పౌర సమాజం అంటే కేవలం స్వచ్ఛంద సంస్థలు కాదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రచయితలు, కళాకారులు, దళిత-బహుజన ఉద్యమకారులు ఇలా ప్రతి ఒక్కరూ చైతన్యం కావాలి. ప్రజలు మౌనంగా ఉన్నప్పుడు పాలక వర్గాలు మరింత బలపడతాయి, ప్రజలు సంఘటితమైతేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.

మార్క్సిస్టు వర్గ దృక్పథంలో చూసినప్పుడు, తెలంగాణ సమస్య కేవలం ప్రాంతీయమైనది కాదు; అది ఒక లోతైన వర్గ సమస్య. ఉత్పత్తి చేసే శ్రమజీవులు ఒకవైపు, ఆ లాభాలను దోచుకునే పాలకుల వర్గం మరోవైపు ఉన్న ఈ సమాజంలో, ఈ వైరుధ్యాన్ని పరిష్కరించకుండా సమాన తెలంగాణ నిర్మాణం అసాధ్యం.

రాజ్యాలు మారాయి, ప్రభుత్వాలు మారాయి, కానీ తెలంగాణ ప్రజల విముక్తి ప్రయాణం ఇంకా గమ్యం చేరుకోలేదు. సామాజిక న్యాయం, విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ప్రజాస్వామ్య హక్కుల కోసం సాగిన ఈ సుదీర్ఘ ప్రయాణం నేటికీ కొనసాగుతూనే ఉంది.

నిజాం పాలనను సవాలు చేసినట్లే, ఉమ్మడి రాష్ట్రంలోని అన్యాయాలను ఎదిరించినట్లే, నేటి వ్యవస్థలోని అసమానతలను సవాలు చేయాల్సిన చారిత్రక కర్తవ్యం నేటి తరం ముందుంది. చరిత్రలో ప్రతి ముందడుగు ప్రజా పోరాటాల ద్వారానే వచ్చింది. అదే బాటలో, పౌర సమాజం మరోసారి చైతన్యవంతమైన పాత్ర పోషించాల్సి ఉంది. ఆ ప్రయాణాన్ని గమ్యానికి చేర్చే బాధ్యత, ఆ గతాన్ని పాఠంగా మార్చుకుని భవిష్యత్తును నిర్మించే చారిత్రక బాధ్యత నేటి తెలంగాణ సమాజానిదే.

**- మామిండ్ల రమేష్ రాజా**
7893230218

# ఎరువుల పంపిణీలో పారదర్శకతే లక్ష్యం.దుష్ప్రచారాలను నమ్మొద్దు

**ఏ పి ఏ ఐ ఎం ఎస్2.0తో అక్రమ మళ్లింపులకు పూర్తిగా చెక్**
**అక్రమాల దారులు మూసుకుపోవడంతోనే అసత్య ప్రచారం,**
**పారదర్శక వ్యవస్థను చూసి కొందరిలో అసహనం**
**నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు**
**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**అమరావతి, జూన్ 26 మనం న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పారదర్శకంగా, సకాలంలో సబ్సిడీ ఎరువులు అందించేందుకు ప్రవేశపెట్టిన ఏపీ ఏఐఎంఎస్2.0 వ్యవస్థ విజయవంతంగా అమలవుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ ఏడాది జూన్ 8వ తేదీ నుంచి కృష్ణా, కాకినాడ జిల్లాలను మినహాయించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏ పీ ఏ ఐ ఎం ఎస్2.0 ద్వారా యూరియా, డీఏపీ పంపిణీ చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 2,97,733 మంది రైతులకు 48,588 మెట్రిక్ టన్నుల యూరియా, 12,874 మెట్రిక్ టన్నుల డీఏపీ విజయవంతంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వ్యవస్థను అమలు చేస్తోందన్నారు. దీనివల్ల అర్హులైన నిజమైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు అందేలా పూర్తి భరోసా కల్పించామని మంత్రి పేర్కొన్నారు.రైతు సాగు చేస్తున్న పంట, సాగు విస్తీర్ణం, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రీయ సిఫార్సుల ఆధారంగా అవసరమైన పరిమాణంలోనే ఎరువులు అందజేస్తున్నామని తెలిపారు. దీంతో సమతుల్య ఎరువుల వినియోగం పెరిగి, రైతులకు దిగుబడులు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ సబ్సిడీ కూడా సక్రమంగా వినియోగమవుతుందని చెప్పారు. ఏపీ ఏఐఎంఎస్ 2.0 ద్వారా ఎరువుల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, మళ్లింపులు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాలు పూర్తిగా అరికట్టే అవకాశం లభించిందన్నారు. ఎరువుల నిల్వలు, సరఫరా, పంపిణీపై రాష్ట్రవ్యాప్తంగా రియల్టైమ్ పర్యవేక్షణ సాధ్యమవుతోందని, ఐ ఎఫ్ ఎం ఎస్, ఏ పి ఏ ఐ ఎం ఎస్, భౌతిక నిల్వల సమన్వయంతో ఖచ్చితమైన నిల్వల నిర్వహణ జరుగుతోందని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత తలెత్తకుండా, అవసరమైన సమయంలో అవసరమైన పరిమాణంలో రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా పంపిణీ నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. కౌలు రైతులతో సహా అర్హులైన ప్రతి రైతుకు సమాన అవకాశాలు కల్పించేలా ఈ వ్యవస్థ రూపొందించబడిందని చెప్పారు. ఎరువుల కొరత, నాణ్యత, అధిక ధరలు లేదా పంపిణీలో ఏవైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి టోల్ ఫ్రీ నంబర్ 155251 కు కాల్ చేయవచ్చని మంత్రి తెలిపారు.రైతులు తమ ఎరువుల కొనుగోలు చరిత్ర, అర్హత వివరాలను కూడా సులభంగా తెలుసుకునే అవకాశం కల్పించామని, రైతు-కేంద్రీకృత, పారదర్శక, సాంకేతికత ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థగా ఏ పి ఏ ఐ ఎం ఎస్2.0 వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఏ నిజమైన రైతుకూ ఎరువు నిరాకరించబడకూడదు... ఏ అనధికార వ్యక్తి లేదా రైతు కాని వ్యక్తికి సబ్సిడీ ఎరువు అందకూడదు అన్నదే ఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.0 మార్గదర్శక సూత్రమని మంత్రి స్పష్టం చేశారు. వ్యవస్థ ప్రారంభ దశలో కొద్దిపాటి సాంకేతిక సమస్యలు ఎదురైనప్పటికీ వాటిలో అధిక భాగం ఇప్పటికే పరిష్కరించామని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఓటిపి లేదా సర్వర్కు సంబంధించిన తాత్కాలిక సమస్యలు ఎదురవుతున్నా, ప్రత్యేక సాంకేతిక బృందాలు 24స7 పర్యవేక్షణ చేస్తూ వాటిని వెంటనే పరిష్కరిస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఏ బి ఏ ఐ ఎం ఎస్ 2.0 పూర్తిస్థాయిలో సజావుగా పనిచేస్తూ రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా ఎరువుల పంపిణీ కొనసాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీ ఎరువుల పంపిణీలో చోటుచేసుకున్న అక్రమాలు, మళ్లింపులు, నిల్వలు, రైతులు కాని వ్యక్తులకు విక్రయాల వంటి అవకతవకలకు పూర్తిగా అడ్డుకట్ట వేయడానికే ఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.0 వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ పారదర్శక విధానం అమలులోకి రావడంతో అక్రమాలకు అవకాశం లేకుండా పోయిందని, దీంతో కొందరి స్వార్థ ప్రయోజనాలకు గండిపడిందని పేర్కొన్నారు. అందుకే మాజీ ముఖ్యమంత్రి జగన్ తనకు అనుకూలంగా ఉన్న పత్రిక ద్వారా రైతులను మభ్యపెట్టేలా నిరాధార కథనాలు ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో తనకు అనుకూలమైన కొందరు డీలర్లు, డిస్ట్రిబ్యూటర్ల ద్వారా యూరియా, డీఏపీ వంటి సబ్సిడీ ఎరువులను అక్రమంగా మళ్లించే అవకాశం ఉండేదని, ఇప్పుడు ఏ పి ఏ ఐ ఎం ఎస్ 2.0 వల్ల అలాంటి అక్రమాలకు పూర్తిగా చెక్ పడిందన్నారు. సాక్షి పత్రిక వాస్తవాలను పూర్తిగా విస్మరించి నిరాధార కథనాలను ప్రచురించడం బాధ్యతాయుత జర్నలిజానికి విరుద్ధం.

# దేశంలో 'ఈజీ కనెక్ట్' ప్రారంభం

**ఇకపై బయలుదేరే ఎయిర్పోర్టులోనే అంతర్జాతీయ ప్రయాణ లాంఛనాలు**
**వారణాసి నుంచి తొలి 'ఈజీ కనెక్ట్' విమాన సర్వీస్ ప్రారంభం**
**టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు సులభతరం**
**కొత్త విధానంతో భారీగా ఉద్యోగాలు, ఆర్థిక ప్రగతి అంచనా**
**విమానా శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు**



**ఢిల్లీ జూన్ 26 మనం ఉత్తరాంధ్ర బ్యూరో:** టైర్-2, టైర్-3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల కోసం నూతన విధానంలో భాగంగా 'ఈజీ కనెక్ట్' విమాన సేవలను ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి సర్వీస్ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త విధానంతో... ఇకపై చిన్న నగరాల నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు తాము బయలుదేరే విమానాశ్రయంలోనే చెక్-ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి లాంఛనాలన్నీ పూర్తి చేసుకోవచ్చు. ఉదాహరణకు, వారణాసిలో అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టే వారు అక్కడే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, దేశీయ విమానంలో ఢిల్లీ వంటి ఇంటర్నేషనల్ హబ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఎలాంటి తనిఖీలు లేకుండా నేరుగా అంతర్జాతీయ విమానం ఎక్కవచ్చు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. విమాన ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, భారత విమానయాన రంగాన్ని ప్రపంచంలోనే పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. 'భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా, స్వయం సమృద్ధి కలిగిన ఏవియేషన్ రంగాన్ని నిర్మించడంలో ఇది ఒక కీలక ముందడుగు' అని ఆయన తెలిపారు. ఈ 'ఈజీ కనెక్ట్' వ్యూహంతో 2030 నాటికి భారత్ను ప్రయాణికులకు ప్రాధాన్య ఏవియేషన్ హబ్గా, 2047 నాటికి గ్లోబల్ ఏవియేషన్ హబ్గా మార్చాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధానం వల్ల పర్యాటకం, వాణిజ్యం, పెట్టుబడులు పెరిగి ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. దీని ద్వారా 2030 నాటికి దాదాపు 4 లక్షల ఉద్యోగాలు, 30 బిలియన్ డాలర్ల అదనపు జీడీపీ సమకూరుతుందని అంచనా

# భక్తి శ్రద్ధలతో మొహరం వేడుకలు

**తెర్నేకల్ గ్రామంలో పీర్ల దేవుళ్లను నిమజ్జనం**



**దేవనకొండ, జూన్ 26, ( మనం న్యూస్):** మండలంలోని తెర్నేకల్ గ్రామంలో శుక్రవారం మొహరం వేడుకలు కులమతాలకు అతీతంగా పెద్ద మత్తుమ్ స్వామి, మోకి స్వామి, పత్తి కొండయ్య స్వామి, మూడు నమలయ్య స్వామి, ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో జరిగాయి. సందర్భంగా మోహన్ నెల ప్రారంభమైన రోజు నుండి ఆసర్ ఖానాలో కొలువైన ఆసన్హుస్సేన్, ఇమామ్ కాసిం పేర్ల దేవుళ్ళను గ్రామ ప్రజలు కులమతాలకు అతీతంగా పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించే ము క్కలు తీర్చుకున్నారు. అలాగే జమ్మి చెట్టు దగ్గరపీర్ల దేవులను నిమజ్జనం చేశారు.అక్కడ ప్రత్యేక పాతేహాలు,( పూజలు )చేశారు. కార్యక్రమంలో, జిల్లా వినియోగదారుల సభ్యులు, నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బి. రాజన్న,, సందప్ప రాముడు, మీరా సాహెబ్, షాజహాన్, శివారెడ్డి, గ్రామ పెద్దలు,ప్రజలు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా కోసం పోరాటం ఆగదు

**ఎమ్మిగనూరు జూన్ 26 మనం న్యూస్ :** క్రైస్తవ మతం మార్చుకున్న దళితులకు ఎస్సీ హోదా కొనసాగించాలని కోరుతూ గల్లీ నుంచి ఢిల్లీ దాకా పోరాటం కొనసాగిస్తామని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) కర్నూలు జిల్లా అధ్యక్షులు యస్.దేవ సహాయం,డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న,మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) రాష్ట్ర కార్యదర్శి జి.ఆనంద్ చైతన్య మాదిగలు పేర్కొన్నారు నియోజకవర్గం దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా పోరాట సంఘం (దళిత సంఘాలు జేఏసి) ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో... డా.బి.ఆర్.అంబేద్కర్ భవన సాధన కమిటి చైర్మన్ కదిరికోట ఆదెన్న స్వయంగా తన రచనలో...రూపొందించిన 120 పేజీల 'మెమోరాండం పుస్తకం'ను యం.బి.యెరూషలేం చర్చి పాస్టర్ రెవరెండ్ జయరాజు బండెల గారి చేతుల మీదుగా ఆవిష్కరించి విడుదల చేశారు.



# అర్ధరాత్రి రాళ్లు, ఇనుప రాడ్లతో మెరుపు దాడులు చేశారు



- **పాకాల సీఐ లాఠీలతో ఇళ్లలోకి వచ్చి చితకబాదారు**
- **దాడులు చేస్తోంది టీడీపీ వాళ్లని చెప్పినా ఆయన వినలేదు**
- **మోహిత్రెడ్డికి మొరపెట్టుకున్న ముద్దలపల్లి బాధితులు**

**పాకాల జూన్26 మనం న్యూస్:** 'చిమ్మచీకట్లో కత్తులు, రాడ్లు, రాళ్లు చేతబట్టుకుని టీడీపీ వాళ్లు మా ఇళ్లపై దాడి చేసి దొరికిన వాళ్లను దొరికినట్టు కొట్టారు.. పోలీసులు దగ్గరుండి కొట్టించారు.. ఆ తరువాత కొడుతున్న వారిని వదిలేసి దెబ్బలు తగిలిన వారినే టార్గెట్ చేసుకుని పాకాల సీఐ చితకబాదారు.. ఇదేం అన్యాయం సార్.. దాడిచేసిన వాళ్లను వదిలేసి మమ్మల్ని కొడతారు ఏమిటని ప్రశ్నిస్తే మహిళలని కూడా చూడకుండా మమ్మల్ని కూడా కొట్టారు.. ఇంత దుర్మార్గమైన ప్రభుత్వాన్ని మేము ఎప్పుడు చూడలేదు..'' అంటూ ముద్దలపల్లె దాడిలో గాయపడిన బాధితులు చెవిరెడ్డి మోహిత్ రెడ్డితో మొరపెట్టుకున్నారు. పాకాల మండలం ముద్దలపల్లి గ్రామంలో గురువారం రాత్రి జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత యువకుడు శ్రీనాథ్ కోలుకోవడంతో ఆ కుటుంబీకులు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసుల దాష్టీకంకు తీవ్ర గాయాలపాలైన ఆ కుటుంబంతో పాటు బాధితుల ఇళ్లను చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్రెడ్డి శుక్రవారం సందర్శించారు. బాధితులను పరామర్శించి దాడి జరిగిన తీరును ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు తమపై జరిగిన దాడిని ఆయనకు వివరిస్తూ పోలీసులే దగ్గరుండి కొట్టించారని, టీడీపీ వాళ్లు కొట్టిన తరువాత పోలీసులు కూడా తమను లాఠీలతో కొట్టి భయభ్రాంతులకు గురిచేశారన్నారు.

# భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు

- **తుంగభద్ర నదిలో పీర్ల దేవుళ్లను నిమజ్జనం**



**మంత్రాలయం,జూన్ 26,మనం న్యూస్ :-** నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయం లో శుక్రవారం మొహరం వేడుకలు కులమతాలకుఅతీతంగా ఖాజా హుస్సేన్ తాత, ముల్లా సాబ్ పింగాణి ఖాజా అధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా మొహరం నెల ప్రారంభమైన రోజు నుండి అసర్ ఖానా లో కొలువైన హసన్ హుశేన్, ఇమాం ఖాశీం పీర్ల దేవుళ్లను గ్రామ ప్రజలు కులమతాలకుఅతీతంగా పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పదవ రోజు మొహరం వేడుకలు హసన్ హుశేన్, ఇమాం ఖాశీం పీర్ల దేవుళ్లను భాజభజంత్రీల మధ్య సంత మార్కెట్ మీదుగా తుంగభద్ర నది లో పీర్లను నిమజ్జనం చేశారు. అక్కడ ప్రత్యేక ఫాతేహాలు (పూజలు) చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పన్నగ వెంకటేష్ స్వామి, టౌన్ అధ్యక్షులు వరదరాజులు, ఎంపిటిసి మేకల వెంకటేష్, వట్టేప్ప నర్సింహులు, నరసింహ, రఘు, సున్నం రాఘు, సిద్దు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై మల్లికార్జున అధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ మురళిధర్ రెడ్డి, కానిస్టేబుల్ యల్లప్ప బందోబస్తు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని మాధవరం, మాలపల్లి, రచ్చుమరి, వగరూరు, తుంగభద్ర, రాంపురం, చిలకలడోణ, సూగురు, తిమ్మాపురం, పలు గ్రామాల్లో మొహరం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ మంత్రాలయం ఎస్సై మల్లికార్జున, మాధవరం ఎస్సై విజయ కుమార్ అధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# సీఎంను కలిసిన టీడీపీ నేత బోలా మల్లికార్జున



**తుగ్గలి జూన్ 26(మనం న్యూస్ ):** జొన్నగిరి గోల్ మైన్స్ ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో టీడీపీ నేత మల్లికార్జున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. జొన్నగిరి గోల్ మైన్స్ ప్రారంభం రాయలసీమ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని బోలా మల్లికార్జున పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంత ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. కార్యకర్తల సమావేశంలో పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలు తదితర అంశాలపై నాయకులతో సీఎం చర్చించారని అయన తెలిపారు . కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలు, ఫైబర్ నేరాలపై విద్యార్థులకు కార్యక్రమం నిర్వహించిన సి ఐ సుబ్రహ్మణ్యం



**జూపాడుబంగ్లా జూన్ 26 (మనం న్యూస్):** ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆత్మకూరు ఎస్ డి పి ఓ ఉత్తర్వుల మేరకు, నందికొట్కూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. సుబ్రమణ్యం, జూపాడుబంగ్లా, ఎస్సై కే మల్లిఖార్జున, 26. తేదీ శుక్రవారం జూపాడుబంగ్లా డి ఆర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల నందు విద్యార్థులకు మాదకద్రవ్యాల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి, విద్యార్థులలో మత్తుపదార్థాల దుర్వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక మరియు చట్టపరమైన పరిణామాల గురించి యువతకు అవగాహన కల్పించడంతో పాటు, మాదకద్రవ్యాలు వాడటం వలన మెదడు పనితీరును, వ్యక్తిగత లక్ష్యాలను నేరుగా ఎలా చెడు ప్రభావితం చేస్తాయో తెలిపి అందరికి శక్తి యాప్ గురించి శక్తి యాప్ నంబర్ 7993485111 ను తెలిపి, బాల్యవివాహాలు చిన్న పిల్లలపై నేరాలు జరిగినచో 1098 ఫిర్యాదు చేయవలెనని, పోక్సో కేసుల పై అవగాహన కల్పించి, వుమన్ వెల్ఫేర్ 181 ఎమర్జెన్సీ కాల్ 100, 112 ల గురించి వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనడం జరిగినది

# మతసామరస్యానికి ప్రతీక మొహరం

**సంగారెడ్డి జూన్ 26 మనం న్యూస్ ప్రతినిధి :** సంగారెడ్డి లో మొహర్రం ఘనంగా నిర్వహించారు. మొహర్రం సందర్భంగా జగ్గారెడ్డి పాత బస్టాండ్ సమీపంలో దర్గా ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పీర్ల ఊరేగింపు లో పాల్గొన్నారు.పీర్ల ఊరేగింపు చూసేందుకు వందల సంఖ్య లో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీక అని కుల మతాలకు అతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు మొహర్రం వేడుకలు చెప్పుకుంటారని మహమ్మద్ ప్రవక్త మనుమడు వీరమరణం పొందిన రోజు సందర్భంగా శోక సముద్రం తో ఆయన త్యాగం స్మరిస్తూ ఈ వేడుకను జరుపుకుంటారని అన్నారు. ప్రతీ సంవత్సరం మాదిరిగా నే ఈ సారి మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి అన్నారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, నాయకులు. కూన సంతోష్, సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, మైనార్టీ నాయకులు తాహెర్, కుతుబుద్దిన్, నదీం, కౌసర్, ఇమ్రాన్, ఆమెర్ జాన్, హకీమ్, ఖమర్ తదితరులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**పెద్దపల్లి, జూన్ 26 (మనం ప్రతినిధి):** పెద్దపల్లి జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి,కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న 'బూత్ డే' నిర్వహిస్తున్నట్లు, ఆ తర్వాత 29, 30 తేదీలలో ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు జిల్లా వ్యాప్తంగా 62,902 మంది చిన్నారులకు పోలి యో చుక్కలు వేయడం జరుగుతుందని, పోలియో చుక్కల పంపిణీ కోసం జిల్లాలో 381 బూత్లు, 25 మొబైల్ టీమ్స్, 24 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# మాదక ద్రవ్యాల బారినపడి జీవితాలను పాడు చేసుకోవద్దు

- **విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలి**
- **గజ్వేల్ సిఐ రవికుమార్**

**గజ్వేల్, జూన్ 26 (మనం న్యూస్):** మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలను పాడు చేసుకోవద్దని గజ్వేల్ సిఐ రవికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది దీనిలో భాగంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ జిల్లా పోలీసు కమిషనర్ రశ్మి పెరుమాళ్ మరియు ఈగుల్ ఫోర్స్ తెలంగాణ ఆదేశాల మేరకు సిగ్నేచర్ ఛాంపియన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దినోత్సవం సందర్భంగా సే నో టూ డ్రగ్స్ సందర్భంగా సిగ్నేచర్ కాంపెయిన్ నిర్వహించారు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా యువతను పెను ముప్పుగా వేధిస్తున్న డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా రక్షించడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకోవడమే లక్ష్యంగా ప్రతి ఏటా జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తారు. మాదకద్రవ్యాల వినియోగం కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా, ఒక పూర్తి కుటుంబాన్ని, తద్వారా యావత్ సమాజ ఉత్పాదకతను నాశనం చేస్తుంది. శాంతిభద్రతల సమస్యలతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. అందుకే డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు విద్యాసంస్థలు సంయుక్తంగా కౌన్సిలింగ్ కేంద్రాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాయి. యువత తమ విలువైన జీవితాన్ని పాడుచేసే ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉండి, మానసిక శారీరక దృఢత్వాన్ని పెంచే క్రీడలు, సృజనాత్మక రంగాల వైపు అడుగులు వేయాలని నిపుణులు సూచిస్తున్నారు.




# ప్రక్రియపై క్లస్టర్ కన్వీనర్లతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ఎమ్మిగనూరు జూన్ 26 మనం న్యూస్** నియోజకవర్గ పరిధిలోని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పురోగతిపై కన్వీనర్లు, మండల అధ్యక్షులు మరియు పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి బూత్లో ఎన్యూమరేషన్ ఫారమ్లు పంపిణీ, ఓటర్ల ధృవీకరణ ప్రక్రియ, మై టీ డి పి యాప్ ద్వారా వివరాల నమోదు మరియు అప్లోడ్ పురోగతిని సమీక్షించారు. ఎమ్మెల్యే బీవీ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి క్లస్టర్ కన్వీనర్ తమ పరిధిలోని బూత్లను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, బి ఎల్ ఓలు మరియు బి ఎల్ ఏ లు సమన్వయంతో ఇంటింటి ఓటరు ధృవీకరణ, ఫ్యామిలీ మ్యాపింగ్, ఎన్యూమరేషన్ ఫారమ్ల పూర్తి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా చూడాలని సూచించారు. ధృవీకరణ సమయంలో ఏవైనా సమస్యలు లేదా సందేహాలు తలెత్తితే వెంటనే పార్టీ కార్యాలయానికి తెలియజేసి పరిష్కరించుకోవాలని ఓటరు జాబితా తయారీలో ప్రతి నాయకుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, యస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో క్లస్టర్ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.





# నిర్మాతలకు విజయ్ షాకింగ్ కండీషన్స్..

## స్పందించి క్లారిటీ ఇచ్చిన 'రణబాలి' మూవీ టీమ్

టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'రణబాలి'. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమా రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోంది. షూటింగ్ దాదాపు చివరి దశకు చేరుకోగా..ఈ సినిమాను సెప్టెంబర్ 11న థియేటర్స్ లోకి తీసుకొచ్చేందుకు మూవీ మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, ఓ షాకింగ్ వార్త నెట్టింట చర్చనీయాంశంగా మారింది. 'రణబలి' సినిమా షూటింగ్ కోసం విజయ్ దేవరకొండ ఏకంగా 5 నుండి 6 క్యారవాన్లు కావాలని డిమాండ్ చేశారంటూ వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అంతేకాకుండా కొన్ని ప్రముఖ న్యూస్ పోర్టల్స్, యాప్స్ పేర్లతో ఉన్న ఫేక్ స్క్రీన్ షాట్స్ ను కూడా సృష్టించి సర్క్యులేట్ చేస్తున్నారు. ఈ విషయం కాస్త మూవీ టీమ్ కంటపడటంతో నిర్మాత రవి స్పందించి క్లారిటీ ఇచ్చారు.

అయితే, ఈ ప్రచారంలో అస్సలు నిజం లేదని, ఇవన్నీ పూర్తిగా అబద్ధపు ముచ్చట్లని స్పష్టం చేశారు. విజయ్ దేవరకొండ ఇమేజ్ ను దెబ్బతీయడానికి కొందరు కావాలనే ఇలాంటి రూమర్స్ క్రియేట్ చేస్తున్నారని.. కాబట్టి సోషల్ మీడియాలో వచ్చే ఇలాంటి తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని, అలాగే వాటిని షేర్ చేస్తూ రూమర్స్ ను అస్సలు నమ్మించవద్దని కోరారు. విజయ్ దేవరకొండ ఎప్పుడూ చాలా ప్రొఫెషనల్ గా ఉంటారని.. సినిమాను చెడగొట్టడానికి కొందరు కావాలనే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. దయచేసి ఇలాంటి రూమర్స్ ను ఎవరూ నమ్మొద్దు, షేర్ చేయొద్దని కోరారు. ఇలాంటి వార్తలను ప్రచారం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పుకార్లకు చెక్ పడినట్లు అయింది.

# మహిళలు చేస్తున్న నేరాలపై సినిమా తీయమన్న నెటిజన్..

## రాహుల్ రవీంద్రన్ షాకింగ్ రియాక్షన్!



టాలీవుడ్ దర్శకుడికి ఓ వింత అనుభవం ఎదురైంది. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పురుషులపై మహిళలు చేస్తున్న నేరాల కాన్సెప్ట్ తో ఓ సినిమా తీయమని నెటిజన్ రాహుల్ ను ట్యాగ్ చేసి మరీ పోస్ట్ పెట్టారు. తాజాగా, ఈ విషయంపై రాహుల్ ట్విట్టర్ ద్వారా రియాక్ట్ అవుతూ.. 'నాకు అన్నీ తెలుసని నేను అస్సలు అనుకోను బ్రదర్.. ఒకవేళ నేను చెప్పేది తప్పైతే నాకు వివరించండి. కానీ, సమాజంలో మగవారిపై ఆడవారు చేసే అఘాయిత్యాలు నాకైతే ఎక్కడా కనిపించడం లేదు. మానసిక సమస్యలు లేదా సమాజ వ్యతిరేక ప్రవర్తన ఉన్న కొందరు ఆడవాళ్లు చేసే ఘోరమైన నేరాలను నేను చూస్తున్నాను. కానీ, మరోవైపు శతాబ్దాలుగా ఆడవారిని ఊపిరాడకుండా చేస్తున్న ఒక వ్యవస్థను నేను గమనిస్తున్నాను. కంటికి కనిపించని, రోజువారీ చిన్న చిన్న దాడుల ద్వారా మహిళలు తమ గుర్తింపును కోల్పోయేలా ఆ వ్యవస్థ బలవంతం చేస్తోంది. అది వారికి సమానమైన ప్రపంచాన్ని ఇవ్వడం లేదు. నా చుట్టూ ఉన్న ఎంతో మంది మహిళలు దీనివల్ల నిశ్శబ్దంగా బాధపడటం చూశాను. అందుకే నా 'ది గర్ల్ ఫ్రెండ్' కథ ద్వారా ఆ విషయాన్నే చెప్పాలనుకున్నాను. ఒక మగవాడిగా సమాజంలో ఉన్న ఈ అధికార సమీకరణాల వల్ల నేను లాభపడుతున్నాను కాబట్టి, దీనికి నేనే బాధ్యత వహించాలని అనుకున్నాను' అని చెప్పారు.

నెటిజన్ చెప్పిన నేర సంఘటన గురించి మాట్లాడుతూ.. 'నేను ఇంకా ఆ కేసు వివరాలు పూర్తిగా చదవలేదు, తప్పకుండా చదువుతాను. ఒకవేళ అందులో ఏదైనా ఆసక్తికరమైన పాయింట్ ఉంటే సినిమా కూడా తీస్తాను. కానీ అది ఒక పర్టికులర్ మహిళ చేసిన నేరం గురించి మాత్రమే ఉంటుంది కానీ, మగవారిపై ఆడవాళ్లు చేసే నేరాల కేటగిరీ కిందకు రాదు. నా దృష్టిలో ఆ రెండింటికీ చాలా తేడా ఉంది. ఇలాంటి నేరాలు చాలా ఘోరమైనవి, దారుణమైనవి. కానీ నేను నా సినిమాలో చూపించాలనుకున్న పాయింట్ వేరు, దానికి ఇలాంటి నేరాలతో ఎలాంటి సంబంధం లేదు' అని క్లారిటీ ఇచ్చారు. చివరగా తన సినిమా గురించి చెప్తూ.. ''ది గర్ల్ ఫ్రెండ్' సినిమాలో విక్రమ్ పాత్ర హంతకుడు లేదా నీచుడు కాదు. అందులో ఎలాంటి శారీరక హింస ఉండదు. నిజానికి అతను నమ్మకమైనవాడే. అయినప్పటికీ, కొందరు ఈ సినిమా చూసి ఎందుకు హర్ట్ అవుతున్నారో వాళ్లే ప్రశ్నించుకోవాలి. ఏదేమైనా మీకు ఎలాంటి సమస్య ఉన్నా దాన్ని ఎత్తి చూపడం మంచి అలవాటు. నేను ఆ ఫీడ్ బ్యాక్ ను తీసుకుని కచ్చితంగా ఆత్మపరిశీలన చేసుకుంటాను. మనమందరం ఒకరితో ఒకరు మాట్లాడుకుని, ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం చాలా మంచి విషయం' అని రాసుకొచ్చారు.

## భారత్ ఆలౌట్.. తొలి టీ20లో

# ఐర్లాండ్ విజయం

రెండు టీ20ల సిరీస్ లో భాగంగా శుక్రవారం భారత్ తో జరిగిన తొలి మ్యాచ్ లో ఐర్లాండ్ విజయం సాధించింది. 34 పరుగుల తేడాతో గెలుపొందింది. 182 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్ 18.5 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్ శర్మ (50; 20 బంతుల్లో 7ఫ4,2స6) అర్ధశతకం వృథా అయ్యింది. శివమ్ దూబె (25), తిలక్ వర్మ (19), అక్షర్ పటేల్ (15) మినహా మిగతావారంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో హంప్ రేస్, హోల్లార్డ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. జై మోంద్రా 2, మెక్కర్తీ, గరేత్ ఒక్కో వికెట్ తీశారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. లొర్కాన్ టక్కర్ (50) హాఫ్ సెంచరీ సాధించాడు. డాక్ రెల్ (49) రాణించాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 3, అక్షర్ పటేల్ 2, అర్ష్దీప్ సింగ్ 2, శివమ్ దూబే ఒక వికెట్ తీశారు.

ఐర్లాండ్తో టీ20 మ్యాచ్ లో భారత్ గెలుపు అవకాశాలు అంతకంతకూ క్లిష్టంగా మారుతున్నాయి. భారీ సిక్సర్ తో టీమ్ ఇండియా గెలుపు ఆశలు సజీవంగా ఉన్నాయని చెప్పిన శివమ్ దూబె (25).. ముంద్రా వేసిన 16వ ఓవర్ చివరి బంతికి కాట్ అండ్ బౌల్డా వెనుదిరిగాడు. హర్షిత్ రాణా క్రీజులోకి వచ్చాడు. 16 ఓవర్లకు భారత్ స్కోరు 135/7. భారత్ విజయం సాధించాలంటే 4 ఓవర్లలో 47 పరుగులు చేయాల్సి ఉంది.

టీమ్ఇండియాకు మరో షాక్ తగిలింది. ఓ వైపు చేయాల్సిన పరుగుల రన్ రేట్ పెరుగుతుంటే.. మరోవైపు వికెట్లు పడుతున్నాయి.




మాథ్యూ హోలార్డ్ వేసిన 12వ ఓవర్ చివరి బంతికి వాషింగ్టన్ సుందర్ (9) పెవిలియన్ కు చేరాడు. బౌండరీ లైన్ వద్ద బెంజమిన్ సులువైన క్యాచ్ ను అందుకొన్నాడు. ప్రస్తుతం భారత్ స్కోరు 12 ఓవర్లకు 100/6. క్రీజ్ లో దూబే, అక్షర్ పటేల్ ఉన్నారు. టీమ్ఇండియా విజయానికి 48 బంతుల్లో 83 పరుగులు అవసరం.

# ఆన్ లైన్ ట్రోలింగ్.. మహిళా క్రీడాకారులకు ఐసీసీ అండ

ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో ట్రోలింగ్ పెరిగింది. క్రీడాకారిణులు, హీరోయిన్లపై దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో టీ20 ప్రపంచకప్లో ఆడుతున్న క్రికెటర్లు ట్రోలింగ్ బారిన పడకుండా ఐసీసీ పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఏఐ సంస్థ ఫ్రీడమ్2హియర్ తో కలిసి 'ఐసీసీ ప్లేయర్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్' ను తీసుకొచ్చింది. ప్రత్యేక టూల్ ద్వారా.. అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న మహిళా ప్లేయర్ల సోషల్ మీడియా ఖాతాలను నిశితంగా గమనిస్తూ, వారు ట్రోలింగ్ బారిన పడకుండా చూడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఇప్పటి వరకు క్రీడాకారులను ఇబ్బంది పెట్టేలా ఉన్న దాదాపు 60,000కు పైగా పోస్టులను తొలగించారు.



2024 మహిళల టీ20 ప్రపంచకప్ సమయంలో ఐసీసీ ఈ టూల్ ను తీసుకొచ్చింది. కానీ, తాజా టీ20 ప్రపంచకప్ సీజన్ మొదలైన తర్వాత ప్లేయర్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్ లో చేరిన వారి సంఖ్య అమాంతం పెరిగింది. తమను ట్రోలింగ్ నుంచి రక్షించాల్సిందిగా 50 మంది క్రికెటర్లు విజ్ఞప్తి చేసినట్లు ఐసీసీ తాజాగా వెల్లడించింది. ఇప్పటి వరకు 100 మందికి పైగా మహిళా క్రీడాకారులు ఇందులో సభ్యులుగా చేరారు. ఐసీసీ సోషల్ మీడియా ఖాతాలకు అదనపు భద్రత చేకూర్చాలనే ఉద్దేశంతో తొలుత దీనిని తీసుకొచ్చారు. కానీ, క్రీడాకారిణులపై ట్రోలింగ్ ఎక్కువవుతున్న నేపథ్యంలో.. మొత్తం 12 జట్లలో కీలకమైన 7 జట్ల సభ్యులతోపాటు, అంపైర్లు, బ్రాడ్ క్యాస్టర్ల అధికారిక ఖాతాలకు కూడా రక్షణ కల్పిస్తున్నట్లు ఐసీసీ ప్రకటనలో పేర్కొంది. టీ20 ప్రపంచకప్ ప్రారంభమైన వారం రోజుల్లోనే ఈ టూల్ 2,50,000 కామెంట్లను రివ్యూ చేసి.. ఇబ్బందికరంగా ఉన్న 60,000 కామెంట్లను తొలగించినట్లు పేర్కొంది. ఇతరులను కించపరిచేలా తరచూ కామెంట్లు చేస్తున్న 2000 మందిని గుర్తించి వారిపై తాత్కాలిక నిషేధం విధించామని, మరో 370 మందిని బ్లాక్ చేసినట్లు పేర్కొంది. సోషల్ మీడియా మరీ ఇబ్బందికరంగా మారుతున్న తరుణంలోనే ఈ ప్రోగ్రామ్ లో చేరాల్సి వచ్చిందని స్పిన్నర్ రాధా యాదవ్ పేర్కొంది. ''స్నేహితులు, కుటుంబ సభ్యులు, అభిమానులతో సరదాగా మాట్లాడుకునేందుకు సోషల్ మీడియా అద్భుతమైన ప్లాట్ఫాం. కానీ, అది క్రమంగా విషపూరితమవుతోంది. ముఖ్యంగా మహిళా క్రీడాకారులను తీవ్ర ఇబ్బంది పెడుతోంది'' అని తెలిపింది.



శివ్ రావేల్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ ప్రాజెక్ట్ 'ఆల్ఫా'. ఇందులో ఆలియా భట్, శార్వరి వాఘ్, బాబీ డియోల్ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. యష్ రాజ్ ఫిలమ్స్ స్త్రీ యూనివర్స్ లో వస్తున్న మొదటి ఫిమేల్ ఓరియంటెడ్ స్త్రీ ఫిల్మ్ కావడంతో 'ఆల్ఫా' సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూలై 3న థియేటర్స్ లోకి రాబోతుంది. ఈనేపథ్యంలో.. ప్రమోషన్స్ జోరు పెంచిన ఆలియా భట్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమాలో ఆలియా భట్ మునుపెన్నడూ లేని విధంగా భారీ యాక్షన్ సీక్వెన్స్ లలో నటించిన విషయం తెలిసిందే. అయితే ఈ యాక్షన్ సీన్స్ అన్నీ స్క్రీన్ పై చాలా రియలిస్టిక్ గా కనిపించడం కోసం తాము చాలా రోజులు కష్టపడి ప్రాక్టీస్ చేశామని ఆలియా చెప్పారు.

# మర్చిపోలేని అనుభూతిని 'ఆల్ఫా' సినిమా ఇచ్చింది: ఆలియా భట్

ఒకరోజు ఫైట్ సీక్వెన్స్ ప్రాక్టీస్ చేస్తున్న సమయంలో తన టైమింగ్ మిస్ అయ్యి అనుకోకుండా ఫైట్ కొరియోగ్రాఫర్ ను గట్టిగా కొట్టేశానని ఆమె గుర్తు చేసుకున్నారు. అది చూసి తానే షాక్ అయ్యానని, వెంటనే అతనికి సారీ కూడా చెప్పానని ఆలియా వివరించారు. తన వల్ల ఒకరికి దెబ్బ తగిలినందుకు చాలా బాధ కలిగిందని ఆలియా ఎమోషనల్ అయ్యారు. అది కావాలని చేసింది కాకపోయినా.. తన వల్ల ఒక వ్యక్తికి దెబ్బ తగలడం తనను చాలా కుంగిపోయేలా చేసిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. షూటింగ్ అయిపోయినా కూడా ఇప్పటికీ ఆ సీన్ గుర్తొచ్చినప్పుడల్లా తనకు మనసులో చాలా బాధగా అనిపిస్తుందని ఆలియా చెప్పుకొచ్చారు. అలాగే ఈ సినిమాలో యాక్షన్ కొరియోగ్రఫీ మాత్రం చాలా అద్భుతంగా ఉంటుందని అన్నారు. తన లైఫ్ లోనే ఎప్పటికీ మర్చిపోలేని ఒక మంచి అనుభూతిని 'ఆల్ఫా' సినిమా తనకు ఇచ్చిందని ఆలియా సంతోషం వ్యక్తం చేశారు.



## 'జైలర్ 2' పూర్తి చేసిన

# హృతిక్ రోషన్!

టైగర్ కా హుకూం.. అంటూ 'జైలర్' చిత్రంతో తనదైన స్టైల్ లో సందడి చేశారు రజనీకాంత్. దీనికి సీక్వెల్ గా 'జైలర్ 2' రూపొందుతోన్న విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో బాలీవుడ్ అగ్రకథానాయకుడు హృతిక్ రోషన్ అతిథి పాత్రలో కనిపిస్తున్నారు. ఆయన పాత్రకు సంబంధించిన షూటింగ్ కూడా పూర్తయినట్లు సమాచారం. సెప్టెంబర్ 11న ఈ సినిమా విడుదల కానుంది. 'జైలర్ 2' సినిమాతో రజనీకాంత్, హృతిక్ రోషన్ మొదటిసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారని అందరూ భావిస్తున్నారు. కానీ, దాదాపు 40 ఏళ్ల క్రితం ఈ ఇద్దరూ ఓ సినిమా కోసం స్క్రీన్ పంచుకున్నారు. 1986లో విడుదలైన 'భగవాన్ దాదా' అనే హిందీ సినిమాలో వీరిద్దరూ నటించారు. అప్పుడు పదేళ్ల వయసున్న హృతిక్ రోషన్ బాలనటుడిగా నటించాడు.ఈ సినిమాను హృతిక్ తండ్రి రాకేశ్ రోషన్ నిర్మించారు. ఇటీవల ఓ కార్యక్రమంలో ఈ సినిమా గురించి హృతిక్ మాట్లాడుతూ.. తన పక్కన ఉన్నది భారతీయ సినిమాలోనే ఒక అతిపెద్ద లెజెండ్ అనే విషయం అప్పట్లో తెలియలేదన్నారు.

# తలైవా 173లో ఆఫర్ అందుకున్న మీనాక్షి చౌదరి!



సూపర్ స్టార్ రజినీకాంత్ తన 173వ చిత్రంతో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి తాజాగా 'ధర్మన్' అనే పవర్ ఫుల్ టైటిల్ ను ఫిక్స్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇందులో రజినీకాంత్ 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నట్లు తెలుపుతూ.. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా ఆయన పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్ ఫుల్ గా ఉండబోతుందని హింట్ ఇచ్చారు మేకర్స్. దీంతో సినిమాపై భారీ ఎక్స్ పెక్టేషన్స్ నెలకొన్నాయి. కమల్ హాసన్ తన రాజ్ కమల్ ఫిలమ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్ పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది.

ఇక త్వరలో సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న 'ధర్మన్'కు సంబంధించి తాజాగా మరో అప్డేట్ కోలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తుంది. ఈ చిత్రంలో ఇప్పటికే సీనియర్ నటి సిమ్రాన్, యంగ్ బ్యూటీ రాశి ఖన్నా భాగం అయినట్లు తెలుస్తుండగా.. తాజాగా మీనాక్షి చౌదరి కూడా ఈ ప్రాజెక్టులో భాగం అయిందని సమాచారం. ప్రస్తుతం డైరెక్టర్ అశ్వత్ మారిముత్తు తమిళ స్టార్ శింబుతో 'STR51' కోసం వర్క్ చేస్తున్నాడు. ఇందులో మీనాక్షి చౌదరిని హీరోయిన్ గా లాక్ చెయ్యగా.. ఇప్పుడు రాబోయే తలైవా 173లో కూడా ఎంపిక చేశారట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతుండగా.. అఫీషియల్ అనౌన్స్మెంట్ రావాల్సి ఉంది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No.New:3-88, Old : 3-22, Chandra Theatre, Gosala, Penamaluru Mandal, Krishna District,(AP),Pin -521151, And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.